Follow: @ANNTELUGU

ANN తెలుగు

# మహా పత్రిక

21-02-2026

శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 54 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM


ఆవిష్కరణతో సమగ్ర అభివృద్ధి
- 2026లో భారతదేశం ఒక కొత్త దిశలో అడుగులు వేస్తోంది.
- ఏఐ ద్వారా అందరికీ అందుబాటులో ఆరోగ్యం
- అనుభవపూర్వక రిటైల్ ద్వారా వినియోగదారునికి విలువ
- బయోటెక్ ద్వారా జీవరక్షక పరిష్కారాలు
- విద్యలో వ్యక్తిగత అభ్యాస పథాలు
- సామాజిక రంగంలో కమ్యూనిటీ ఆధారిత మార్పు
- సాంకేతికతను మానవతతో మేళవించడం- ఇదే భారత ఆవిష్కరణల అసలైన శక్తి.

ANN తెలుగు మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ 21-02-2026

మహా ప్రత్యేకం 04

నూతన మైలురాళ్లు

ఏఐ హెల్త్ టెక్ నుండి అనుభవపూర్వక రిటైల్ వరకు, బయోటెక్ నుండి సామాజిక ఆవిష్కరణ వరకు—2026లో భారతీయ స్టార్టప్‌లు, శాస్త్రవేత్తలు, వ్యవస్థాపకులు ప్రపంచ వేదికపై తమ ముద్ర వేస్తున్నారు. దేశ ఆర్థికాభివృద్ధికి తోడు సమానత్వం, స్థిరత్వం, మానవ కేంద్రిత దృక్పథం ఇవన్నీ కలగలిపిన నవ భారతం.


ఆవిష్కరణల నవ భారతం

2026 ఏఐ, బయోటెక్ రంగాలకు నూతన శకం

ఆవిష్కరణలతో అభివృద్ధి - అభివృద్ధితో సమానత్వం

ప్రత్యేక కథనం 4లో

## టాప్ న్యూస్



### ప్రపంచం ముందుకు ఏలియన్స్ సీక్రెట్ ఫైల్స్


#### ట్రంప్ సంచలన ప్రకటన

మహా: అమెరికాలో ఏలియన్స్, యూఎఫ్ఓలకు సంబంధించిన ప్రభుత్వ ఫైళ్లను విడుదల చేసే ప్రక్రియను ప్రారంభించాలని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశించారు. గ్రహాంతరవాసులు, గుర్తుతెలియని ఎగిరే వస్తువులకు సంబంధించిన రహస్య ఫైళ్లను గుర్తించి.. వాటిని బహిర్గతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ట్రంప్ తీసుకున్న ఈ సంచలన నిర్ణయంతో గ్రహాంతర వాసుల ఉనికిపై దశాబ్ద కాలంగా సాగుతున్న అమెరికన్ల ఉత్కంఠకు తెరపడనుంది. ప్రజల్లో ఈ రహస్యాల పట్ల ఉన్న ఆసక్తిని తీర్చాలని భావించే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తన ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ పేర్కొన్నారు.



### అల్లు అర్జున్ కేసులో పోలీసుల ఛార్జ్ షీట్

హైదరాబాద్, మహా :సంధ్య థియేటర్ కేసుకు సంబంధించి పోలీసుల ఛార్జ్ షీట్‌లో సరైన సాక్ష్యాలు, ఆధారాలు లేవని, సాంకేతిక లోపాలు ఉన్నాయని నాంపల్లి కోర్టు అభిప్రాయపడింది. హార్డ్ డిస్క్‌లు, సీడీలు, పెన్ డ్రైవ్‌లు సరిగ్గా జత చేసి ఛార్జ్ షీట్ పంపాలని నాంపల్లి కోర్టు ఆదేశించింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో అల్లుఅర్జున్ సహా 23 మందిపై పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. తొక్కిసలాట లో గాయపడ్డ శ్రీ తేజ్ ఇప్పటికీ కోలుకోలేదు.



### బెంగుళూరులో జై బాబు

మహా : బెంగుళూరులో మహేష్ బాబు ఫ్యాన్స్ సందడి చేశారు. బెంగుళూరు కపాలి లో ఎంబి థియేటర్ ను సందర్శించిన మహేష్ బాబు ను జైబాబు నినాదాలతో బెంగళూరియన్స్ ఘనస్వాగతం పలికారు. జై బాబు అంటూ మోత మోగించారు. మహేష్ బాబు ఏఎంబి బెంగుళూరు వీడియోలు సోషల్ మీడియాలో మోత మోగిస్తున్నాయి.




# ట్రంప్‌కు బిగ్ షాక్

## ట్రంప్ టారిఫ్‌లు కొట్టేసిన అమెరికా సుప్రీంకోర్టు

- సుంకాలు విధించే హక్కు ట్రంప్‌కు లేదు
- అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- భారత్ పై 18 శాతం సుంకం.. ఇక నో టారిఫ్
- వసూలు చేసింది కూడా తిరిగిచ్చేయమన్న సుప్రీం కోర్టు
- 14 లక్షల కోట్లు తిరిగి ఇచ్చేయాల్సిందే
- లాభాల్లోకి అమెరికా స్టాక్ మార్కెట్లు

మహా బ్యూరో: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆర్థిక విధానాలకు ఆ దేశ అత్యున్నత న్యాయస్థానం భారీ షాక్ ఇచ్చింది. ప్రపంచ దేశాల నుంచి వచ్చే దిగుమతులపై ట్రంప్ సర్కార్ విధించిన గ్లోబల్ టారిఫ్‌లను అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఫిబ్రవరి 20న వెలువరించిన ఈ తీర్పులో 6-3 మెజారిటీతో న్యాయస్థానం ట్రంప్ నిర్ణయాన్ని తప్పుబట్టింది. 'అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం'ప్రకారం అధ్యక్షుడికి అడ్డగోలుగా సుంకాలు విధించే అధికారం లేదని కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పుతో ఇప్పటివరకు ప్రభుత్వం వసూలు చేసిన సుమారు $175 బిలియన్ల (దాదాపు 14 లక్షల కోట్ల రూపాయలు) పైగా నిధులను తిరిగి ఆయా కంపెనీలకు చెల్లించాల్సి ఉంటుంది. ఇది అమెరికా బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

వివరాలు 2లో


# పరిషత్‌కు సై



- ఎన్నికలకు సై అంటున్న మంత్రులు, ఎమ్మెల్యేలు
- గ్రౌండ్ రిపోర్ట్ తెప్పించుకున్న సీఎం రేవంత్
- ఏప్రిల్ లో ఎన్నికలకు వెళ్ళే ఛాన్స్
- పది పరీక్షలు ముగియగానే ఎన్నికల పరీక్ష
- 31 జిల్లా పీఠాల స్వీప్ పై నజర్.. సమ్మర్ లో గ్రేటర్ వార్
- ఎల్లుండి జరిగే కేబినెట్ లో కీలక నిర్ణయం
- త్వరలో రైతుభరోసా.. బడ్జెట్ లో రూ.2500 పథకం
- ఎపుడైనా రెడీ అంటున్న ఎన్నికల సంఘం

| ఎంపీటీసీలు | జడ్పీటీసీలు | ఎంపీపీలు | జిల్లా పరిషత్ ఛైర్మన్ లు |
|---|---|---|---|
| 5749 | 565 | 565 | 31 |

(హైదరాబాద్ - మహా)



పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన ఉత్సాహంలో పరిషత్ ఎన్నికలకు కాంగ్రెస్ ప్రభుత్వం సై అంటోంది. గ్రేటర్ హైదరాబాద్ విభజనకు సంబంధించి హైకోర్టు లో విచారణ జరుగుతున్న నేపథ్యంలో మార్చి 19న వాయిదా ఉంది. గ్రేటర్ కంటే ముందు పరిషత్ ఎన్నికలు పూర్తిచేసేద్దామని మంత్రులు, ఎమ్మెల్యేలు ఉత్సాహంగా ఉన్నారు. క్షేత్రస్థాయి ఫీడ్ బ్యాక్ ఆధారంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పరిషత్ ఎన్నికలు పూర్తిచేయాలని డిసైడ్ అయ్యారు. వాస్తవానికి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామపంచాయతీ ఎన్నికల కంటే ముందే పరిషత్ ఎన్నికలకు సిద్ధమైంది. నోటిఫికేషన్ రిలీజై నామినేషన్లు మొదలయ్యాక.. ఎన్నికలు బ్రేక్ అయ్యాయి. ఆ తర్వాత గ్రామపంచాయతీ, మునిసిపల్ ఎన్నికలు పూర్తిచేసేసిన కాంగ్రెస్ సర్కారు.. 80 శాతానికి పైగా విజయాలతో దూకుడుమీదుంది. అయితే మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఆ పరీక్షలు ముగిసిన తర్వాత.. ఏప్రిల్ నెలలో నిర్వహించాలనే ఆలోచనలో ఉంది. విద్యాశాఖ మంత్రిగా కూడా ముఖ్యమంత్రి ఉన్నారు. రెండు విడతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనున్నారు.

మిగతా 2లో

## ఏఐతో ఉద్యోగ గండం

- 18 నెలల్లో అమెరికాలో లక్షల కొలువుల మాయం
- ఖర్చు తగ్గించుకోవడానికి కంపెనీలు ఏఐ వైపు మొగ్గు

2లో


# ఏఐ వార్ రూమ్ ఏర్పాటుకు హైదరాబాద్ రెడీ

- ఏఐకి ప్రత్యేక మంత్రిత్వ శాఖ అవసరం
- జీఎస్టీ కౌన్సిల్ లా ఏఐ కౌన్సిల్ ఏర్పాటుచేయాలి
- భారతదేశాన్ని ప్రపంచ ఏఐ పవర్‌హౌస్‌గా నిర్మించాలి
- ఢిల్లీలోని ఏఐ సమ్మిట్ లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



ఢిల్లీ, మహా : ప్రస్తుతం యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ ముందంజలో నిలవాలంటే కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక ఏఐ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. .ప్రపంచవ్యాప్తంగా ఏఐ పరిణామాలు పర్యవేక్షించేందుకు జాతీయ ఏఐ వార్ రూమ్ ఉండాలని ప్రతిపాదించిన సీఎం కేంద్రం అనుమతిస్తే హైదరాబాద్‌లోనే నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందన్నారు. ఏఐ వినియోగం, నియంత్రణ, చట్టపరమైన మార్గదర్శకాలు, జాతీయ భద్రత వంటి అంశాలను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో నిర్వహించిన ఏఐ సమ్మిట్‌లో ప్రసంగించిన సీఎం, మానవ చరిత్రలో అగ్ని, చక్రం, వ్యవసాయం, విద్యుత్, ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణలు ప్రపంచాన్ని ఎలా మార్చాయో గుర్తుచేశారు. ఏఐ కూడా అలాంటి విప్లవాత్మక సాంకేతికతేనని, ఇది కేవలం ఇంకొక టెక్నాలజీ కాదని, మానవ పరిణామ క్రమంలో అత్యంత శక్తివంతమైన మలుపని అభివర్ణించారు. మునుపటి యంత్రాల మాదిరిగా కాకుండా ఏఐ స్వయంగా నేర్చుకోగలదని, విశ్లేషించగలదని, నిర్ణయాలు తీసుకోగలదని పేర్కొన్నారు.

మిగతా 2లో



# మున్సిపల్ చైర్ పర్సన్‌కు కంది శ్రీనివాస రెడ్డి సత్కారం

## నేడు బాధ్యతలు స్వీకరించనున్న బండారి అనూష

ఆదిలాబాద్ మహా : రాజకీయాలలో డబ్బు ప్రధానం కాదని నీతి నిజాయితీ నిబద్ధత ప్రజలకు మంచి చేసి వారి విశ్వాసాన్ని పొందడం ముఖ్యమని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు.శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ లతో పాటు పార్టీ కౌన్సిలర్లను శాలువాలతో సత్కరించారు.బండారి అనూషను చైర్ పర్సన్ చేసినందుకు



# ట్రంప్‌కు బిగ్ షాక్

- ట్రంప్ టారిఫ్ లు కొట్టేసిన అమెరికా సుప్రీంకోర్టు
- సుంకాలు విధించే హక్కు ట్రంప్‌కు లేదు
- అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- భారత్ పై 18 శాతం సుంకం.. ఇక నో టారిఫ్
- వసూలు చేసింది కూడా తిరిగిచ్చేయమన్న సుప్రీం కోర్టు
- 14 లక్షల కోట్లు తిరిగి ఇచ్చేయాల్సిందే
- లాభాల్లోకి అమెరికా స్టాక్ మార్కెట్లు



**మహా బ్యూరో:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆర్థిక విధానాలకు ఆ దేశ అత్యున్నత న్యాయస్థానం భారీ షాక్ ఇచ్చింది. ప్రపంచ దేశాల నుంచి వచ్చే దిగుమతులపై ట్రంప్ సర్కార్ విధించిన గ్లోబల్ టారిఫ్‌లను అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఫిబ్రవరి 20న వెలువరించిన ఈ తీర్పులో 63 మెజారిటీతో న్యాయస్థానం ట్రంప్ నిర్ణయాన్ని తప్పుబట్టింది. 'అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం'ప్రకారం అధ్యక్షుడికి అడ్డగోలుగా సుంకాలు విధించే అధికారం లేదని కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పుతో ఇప్పటివరకు ప్రభుత్వం వసూలు చేసిన సుమారు $175 బిలియన్ల (దాదాపు 14 లక్షల కోట్ల రూపాయలు) పైగా నిధులను తిరిగి ఆయా కంపెనీలకు చెల్లించాల్సి ఉంటుంది. ఇది అమెరికా బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

**అధికారం లేదు అధ్యక్షా**

అమెరికా సుప్రీంకోర్టు వివిధ దేశాలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌లను కొట్టేసింది. సుంకాలు విధించే అధికారం అధ్యక్షుడికి లేదని తేల్చింది. ఇప్పటివరకు వివిధ దేశాల నుంచి వసూలు చేసిన సుంకాలను ట్రంప్ తిరిగి చెల్లించాల్సిందే అని స్పష్టం చేసింది. . అమెరికా సుప్రీంకోర్టు తీర్పుతో యూఎస్ స్టాక్ మార్కెట్లు ఒక్కసారిగా లాభాల బాట పట్టాయి. ఇప్పటికే పలు దేశాలపై సుంకాలు విధించిన ట్రంప్.. భారత్‌పై 18 శాతం సుంకాలు వసూలు చేస్తున్నారు. సుప్రీం తీర్పుతో భారత్ నుంచి వసూలు చేసిన సుంకాలను తిరిగి చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అమెరికా సుప్రీంకోర్టులో ప్రెసిడెంట్ ట్రంప్‌నకు ముగ్గురు న్యాయమూర్తులు అనుకూలంగా ఉండగా.. ఆరుగురు న్యాయమూర్తులు వ్యతిరేకించారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం సుంకాలను విధించే అధికారం ఆ దేశ పార్లమెంట్‌కు ఉంటుంది. అయితే, ట్రంప్ సుంకాలను కీలకమైన ఆర్థిక, విదేశాంగ విధాన సాధనంగా ఉపయోగించారు. అయితే, ట్రంప్ సుంకాలను కీలకమైన ఆర్థిక, విదేశాంగ విధాన సాధనంగా ఉపయోగించారు. దీనిపై విచారణ చేపట్టిన అమెరికా అత్యున్నత న్యాయస్థానం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

**భారత్ కు ఊరట**

పన్నులు లేదా సుంకాలు విధించే అధికారం కేవలం అమెరికా పార్లమెంట్ కు మాత్రమే ఉంటుందని, అధ్యక్షుడు తన పరిధిని మించి ఈ నిర్ణయం తీసుకున్నారని చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్ తన తీర్పులో పేర్కొన్నారు. జాతీయ అత్యవసర పరిస్థితిని సాకుగా చూపి ఏకపక్షంగా ప్రపంచ వాణిజ్యంపై పన్నులు వేయడం చట్టబద్ధం కాదని కోర్టు తేల్చిచెప్పింది. ట్రంప్ తన రెండో విడత పదవీ బాధ్యతలు చేపట్టాక, చైనా, మెక్సికో, కెనడా, భారత్ వంటి దేశాల నుంచి వచ్చే వస్తువులపై 10% నుండి 50% వరకు అదనపు సుంకాలు విధించారు. ముఖ్యంగా ఫెంటానిల్ డ్రగ్ సరఫరాను అడ్డుకోవడంలో విఫలమైనందుకు మెక్సికోపై, వాణిజ్య లోటును తగ్గించేందుకు ఇతర దేశాలపై ఈ 'టారిఫ్ బాంబు' వేశారు. ట్రంప్ విధించిన సుంకాలను సవాల్ చేసిన దేశాలలో భారత్ కూడా ఒకటి. ఈ తీర్పుతో భారతీయ ఎగుమతిదారులకు, ముఖ్యంగా ఐటీ, స్టీల్, ఫార్మా రంగాలకు పెద్ద ఊరట లభించనుంది.

**తీవ్రంగా స్పందించిన ట్రంప్**

ఈ తీర్పుపై డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ఇది అమెరికా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే నిర్ణయమని, దీనివల్ల విదేశీ కంపెనీలకే లాభమని ఆయన విమర్శించారు. కోర్టు అడ్డుకున్నా తన వద్ద 'ప్లాన్‌బి' సిద్ధంగా ఉందని, ఇతర చట్టపరమైన మార్గాల ద్వారా ఈ సుంకాలను మళ్ళీ అమలు చేస్తానని ఆయన హెచ్చరించారు. అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు ప్రపంచ వాణిజ్య యుద్ధంలో ఒక కీలక మలుపుగా మారింది. ఇది అధ్యక్షుడి అపరిమిత అధికారాలకు అడ్డుకట్ట వేయడమే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్లలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

# పరిషత్‌కు సై

(మొదటిపేజీ తరువాయి)

ఈనెల 23న జరిగే కేబినెట్ మీటింగ్ లో దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు. ప్రభుత్వం ముందుకొస్తే రాష్ట్రంలోని 31 జిల్లాల్లో 565 మండలాల్లో 5,749 ఎంపీటీసీ, 565 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సన్నద్ధంగా ఉండటం విశేషం.

**జిల్లాల వారీగా సన్నద్ధం**

మార్చిలోనే రెండు విడతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించి.. 14లోగా జెడ్పీ ఛైర్మన్ల ఎన్నికనూ పూర్తి చేయాలన్న ప్రతిపాదన కూడా ఉంది. ఇదే జరగాలనుకుంటే ఈనెల 26 నుండి ప్రారంభించాలనుకున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను మార్చి 15 తర్వాత ప్రారంభించే అవకాశాలున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మక ఎత్తుగడలు, మంత్రులంతా జట్టుగా తెలంగాణ మునిసిపల్ ఎన్నికల్లో జెండా ఎగరేసిన విధానానికి హైకమాండ్ అబ్బురపడింది. కాంగ్రెస్ క్యాడర్ లో ఆత్మస్థైర్యం పెరిగింది. ఎన్నిక ఏదైనా కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా నేతలంతా శ్రమిస్తారని ప్రస్ఫుటమైంది. ఇపుడు 565 మండలాల్లో కాంగ్రెస్ జెండా ఎగరేసేందుకు రెడీ అవుతున్నారు.

**ప్రతిపక్షాలు బలహీనం**

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు ఒక్క సీటు కూడా రాకపోగా.. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సిటింగ్ సీట్లను కూడా కోల్పోయింది. పంచాయతీ ఎన్నికల్లో 60 శాతానికి పైగా సర్పంచ్ స్థానాలను అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోగా.. బీఆర్ఎస్ 26శాతానికే పరిమితమైంది. దీంతో మునిసిపల్ ఎన్నికల్లోనూ 80శాతానికి పైగా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లను కాంగ్రెస్ కైవసం చేసుకుంది.. ఇక లోక్‌సభ ఎన్నికల్లో 8 సీట్లు దక్కించుకున్న బీజేపీ.. ఆ ఎన్నికలతోపాటు జరిగిన కంటోన్మెంట్ ఉపఎన్నికలో ప్రధాన ప్రత్యర్థిగా నిలిచింది. అయితే జూబ్లీహిల్స్ ఉపఎన్నిక, పంచాయతీ ఎన్నికల్లో మూడో స్థానానికి పరిమితమైంది. ఇపుడు మునిసిపల్ ఎన్నికల్లో దారుణంగా బలహీనపడింది. ఇదే వేడిలో పరిషత్ ఎన్నికలూ నిర్వహించాలని యోచనలో సీఎం ఉన్నారు. మార్చి 15కు ముందు నిర్వహించేందుకు ఏ మాత్రం వీలున్నా.. వెంటనే ఎన్నికలకు వెళ్ళొచ్చు.

## రైతుభరోసా జమ.. మహాలక్ష్మి 2500పై హామీ

**ఎన్నికలకు డిసైడ్ అయితే రైతుభరోసా పథకం నగదును రైతుల ఖాతాల్లోకి జమ మొదలుపెట్టే అవకాశం ఉంది. మరోవైపు ఈసారి బడ్జెట్ లో మహాలక్ష్మి పథకం రూ.2500 పథకం అమలుకు సంబంధించి బడ్జెట్ కేటాయించే అవకాశం ఉండడంతో, దీనిపై కూడా స్పష్టమైన హామీనిచ్చే అవకాశాలున్నాయి.**

**గతంలోనే పరిషత్ పై కసరత్తు**

పరిషత్ ఎన్నికలపై గతంలోనే కసరత్తు పూర్తిచేసింది కాంగ్రెస్ పార్టీ. జిల్లాల వారీగా ఇన్ ఛార్జి మంత్రులు సమావేశాలు కూడా నిర్వహించారు. జడ్పీఛైర్మన్ అభ్యర్థులపై ఒక అవగాహనకు వచ్చేశారు. క్షేత్రస్థాయిలోనూ వర్క్ చేశారు. ఇపుడు కొత్తగా మళ్ళీ ఫీల్డ్ కు వెళ్ళి సన్నాహక సమావేశాలు నిర్వహించాల్సిన అవసరం కూడా లేదు. మునిసిపల్ విజయాలతో అందరూ జోరుమీద.. ఏదొచ్చినా గెలిచేస్తాం అన్నంత రెడీగా ఉన్నారు. ఈ క్రమంలో పరిషత్ పోరు పై ముందున్న ఆప్షన్లను 23న ఖరారు చేయనున్నారు.

## అక్రెడిటేషన్‌లపై సమావేశం

**హైదరాబాద్, మహా:** జిల్లాస్థాయి అక్రెడిటేషన్ కమిటీలను వారం రోజులలో పూర్తి చేయాలని డీపీఆర్వోలను సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక ఆదేశించారు. శుక్రవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ ఆడిటోరియంలో అక్రెడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ విధి విధానాలపై డీపీఆర్వోలకు, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీఓ నెం.252, 103లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పీఆర్వోలకు సూచించారు. జిల్లాస్థాయి అక్రెడిటేషన్ కమిటీలను సంబంధిత జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని స్థానిక ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ప్రతినిధులతో ఒక కమిటీని వారం రోజులలో పూర్తి చేయాలని ఆమె వెల్లడించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా, ఫ్రీలాన్స్, వెటరన్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల నమోదు, దరఖాస్తుల పరిశీలన, రిపోర్టులు, అప్రూవుడ్ లిస్టులు, రిజిస్ట్రేషన్ నెంబర్ అలాట్‌మెంట్, అక్రెడిటేషన్ కార్డుల డౌన్ లోడింగ్, మొదలగు అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆమె సంబంధిత అధికారులను కోరారు. అదే విధంగా అక్రెడిటేషన్ కార్డుల ప్రక్రియలో భాగంగా ఆన్ లైన్, ఇతర సమస్యలు తలెత్తితే వెంటనే రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మీడియా రిలేషన్ వింగ్ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలన్నారు. సాంకేతిక సమస్యలు ఉంటే టెక్నికల్ టీమ్ ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉంటారని వారిని కూడా సంప్రదించి ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా అక్రెడిటేషన్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆమె కోరారు. ఈ శిక్షణా కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల డీపీఆర్వోలు సంబంధిత సిబ్బంది హాజరయ్యారు. శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి అధికారులకు అక్రెడిటేషన్ కార్డుల జారీపై ఆన్ లైన్ విధి విధానాలపై క్షేత్రస్థాయి సిబ్బందికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి సిబ్బంది లేవనెత్తన అంశాలపై మీడియా రిలేషన్ విభాగం అధికారులు డీ.ఎస్.జగన్, యామిని, వెబ్ సైట్ టీమ్ మేనేజర్ నంద, టెక్నిషన్ సాయిలు అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. అర్హత గల జర్నలిస్టులు http://ipr.telangana.gov.in ద్వారా ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే సెల్ నెం.9154170881ను సంప్రదించాలని తెలియజేశారు.

# ఏఐతో ఉద్యోగ గండం

- 18 నెలల్లో అమెరికాలో లక్షల కొలువుల మాయం
- ఖర్చు తగ్గించుకోవడానికి కంపెనీలు ఏఐ వైపు మొగ్గు

**మహా:** ఏఐ సాంకేతికత శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో అమెరికాలో రాబోయే 12 నుంచి 18 నెలల్లో లక్షలాది వైట్ కాలర్ ఉద్యోగాలు ప్రమాదంలో పడనున్నాయని మాజీ డెమోక్రాటిక్ అధ్యక్ష అభ్యర్థి, వ్యాపారవేత్త ఆండ్రూ యాంగ్ సంచలన హెచ్చరికలు జారీ చేశారు. ఏఐ ప్రోగ్రామ్‌లు నిమిషాల్లో పూర్తి చేస్తున్న పనులకు గతంలో డిజైనర్లకు రోజుల సమయం పట్టేదని, ఈ మార్పు ఉద్యోగ విపత్తుకు సంకేతమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆండ్రూ యాంగ్ విశ్లేషణ ప్రకారం కాల్ సెంటర్ సిబ్బంది, మార్కెటింగ్ నిపుణులు, కోడర్లు, డేటా అనలిస్టులు చేసే పనులను ఏఐ ఇప్పుడు సులభంగా పూర్తి చేస్తోంది. కేవలం సమాచారాన్ని విశ్లేషించి నివేదికలు ఇచ్చే సీనియర్ స్థాయి ఉద్యోగుల అవసరం కూడా భవిష్యత్తులో తగ్గిపోతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒక సంస్థ ఖర్చులను తగ్గించుకోవడానికి ఏఐని వాడి సిబ్బందిని తొలగిస్తే, పోటీలో నిలబడటానికి మిగతా సంస్థలు కూడా అదే మార్గాన్ని అనుసరించక తప్పదని ఆయన విశ్లేషించారు. సిబ్బందిని తగ్గించి లాభాలు పెంచుకునే కంపెనీలకే స్టాక్ మార్కెట్ పెద్దపీట వేయడం కూడా ఈ ధోరణికి కారణమవుతోందని తెలిపారు. ఈ పరిణామాల వల్ల అమెరికాలోని దాదాపు 7 కోట్ల వైట్ కాలర్ ఉద్యోగాల్లో 20 శాతం నుంచి 50 శాతం వరకు రాబోయే కొన్నేళ్లలో కనుమరుగయ్యే ప్రమాదం ఉందని యాంగ్ హెచ్చరించారు. ఉద్యోగాల కోత ప్రజల కొనుగోలు శక్తిని దెబ్బతీసి, రియల్ ఎస్టేట్ రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, ఇది స్థానిక ఆర్థిక వ్యవస్థలను కుంగదీస్తుందని అన్నారు. దీనికి పరిష్కారంగా 'యూనివర్సల్ బేసిక్ ఇన్కమ్' పథకాన్ని అమలు చేయాలని, ఏఐ కంపెనీలపై అదనపు పన్నులు విధించి ఆ నిధులతో ఉపాధి కోల్పోయిన వారికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ హెచ్చరికలకు బలం చేకూరుస్తూ ఇప్పటికే అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థలు తమ కార్యకలాపాల్లో ఏఐ వినియోగాన్ని పెంచి వేలాది మంది ఉద్యోగులను తొలగించడం ప్రారంభించాయి. 2026 చివరి నాటికి ఏఐ ఆధారిత ఆటోమేషన్ వల్ల ప్రపంచ టెక్నాలజీ ఉపాధి రంగంలో భారీ మార్పులు రావడం ఖాయమని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## లైసెన్సు ఉన్న హుక్కా లాంజ్ లపై కేసులు రద్దు

### పోలీసుల చర్య చట్ట ప్రక్రియ దుర్వినియోగమే అన్న హైకోర్టు

**హైదరాబాద్, మహా :** లైసెన్సుతో నడుస్తున్న హుక్కా లాంజ్ నిర్వాహకులపై నమోదైన క్రిమినల్ కేసులను తెలంగాణ హైకోర్టు రద్దు చేసింది. స్పష్టమైన చట్ట ఉల్లంఘన లేకుండానే పోలీసులు కేసులు నమోదు చేయడం చట్ట ప్రక్రియను దుర్వినియోగ పరచడమే అని కోర్టు పోలీసులు చర్యలను తప్పు పట్టింది. నగరంలోని ఓ హుక్కా లాంజ్ పై పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 223తో పాటు సిగరెట్లు మరియు ఇతర పొగాకు ఉత్పత్తుల నియంత్రణ చట్టం కింద కేసు నమోదు చేశారు. అయితే నిర్వాహకులకు వర్తించే ట్రేడ్ లైసెన్సు, ఆహార భద్రత అనుమతులు ఉన్నట్లు రికార్డులు చూపిస్తున్నాయని కోర్టు గమనించింది. పోలీసులు చూపించిన ఆరోపణల్లో చట్టపరమైన స్పష్టత లేదని, సంబంధిత చట్టంలోని నిబంధనల ఉల్లంఘనను నిరూపించే ఆధారాలు లేవని న్యాయస్థానం తెలిపింది. కేవలం అనుమానాల ఆధారంగా క్రిమినల్ కేసులు నమోదు చేయడం సమంజసం కాదని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో హుక్కా లాంజ్ నిర్వాహకులపై నమోదైన కేసులను కోర్టు రద్దు చేస్తూ, చట్టాన్ని అమలు చేసే అధికార సంస్థలు నిబంధనల ప్రకారం వ్యవహరించాలని సూచించింది. భవిష్యత్ లో ఇలాంటి కేసులు నమోదు చేస్తే సహించేది లేదని స్పష్టం చేసింది.

## ఏఐ వార్ రూమ్ ఏర్పాటుకు
# హైదరాబాద్ రెడీ



(మొదటిపేజీ తరువాయి)

**యువతను ఏఐ-ఆధారిత భవిష్యత్తుకు సిద్ధం చేయాలి**

రోబోటిక్స్‌తో కలిసినప్పుడు యంత్రాలు మానసిక మేధస్సుతో పాటు శారీరక సామర్థ్యాన్ని కూడా పొందుతున్నాయని అన్నారు. ప్రపంచ ఏఐ పోటీ ఇప్పటికే ప్రారంభమైందని, కొన్ని దేశాలు, కంపెనీలు ముందంజలో ఉన్నాయని సీఎం చెప్పారు. గత పారిశ్రామిక విప్లవాల సమయంలో జరిగిన అవకాశ నష్టాలను గుర్తు చేస్తూ, ఈసారి భారత్ అలాంటి తప్పిదం చేయకూడదని హెచ్చరించారు. సేవలు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో విజయం సాధించిన భారత్, ప్రపంచ స్థాయి కోర్ టెక్నాలజీ ఉత్పత్తుల్లో కూడా నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. దేశానికి తక్షణ జాతీయ ఏఐ రోడ్‌మ్యాప్ అవసరమని ఆయన నొక్కిచెప్పారు. ఏఐ అభివృద్ధి ప్రతి దశలో సెమీకండక్టర్ చిప్ తయారీ, జీపీయూ సామర్థ్యాలు, డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ వినియోగం, ఏఐ ప్లాట్‌ఫారమ్‌లు, అప్లికేషన్లు భారత్ స్పష్టమైన వ్యూహంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ పరిణామాలను నిశితంగా పర్యవేక్షించేందుకు కేంద్రం-రాష్ట్రాల సమన్వయంతో జాతీయ "ఏఐ వార్ రూమ్" ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కేంద్రం అనుమతిస్తే హైదరాబాద్‌లో అలాంటి వార్ రూమ్ నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రపంచ స్థాయి పరిశోధనలకు ఊతమిచ్చే ఏఐ యూనివర్సిటీని దేశంలో స్థాపించాలని సూచించారు. ఏఐ విస్తరణ నేపథ్యంలో ఉపాధిపై ఉద్భవిస్తున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ, కొన్ని రంగాల్లో ఉద్యోగ నష్టాలు సంభవించవచ్చన్నారు. అయితే సరైన రీస్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్ చర్యల ద్వారా ఏఐ వల్ల సృష్టించబడే కొత్త అవకాశాలు మరింత విస్తృతంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. యువతను ఏఐఆధారిత భవిష్యత్తుకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. స్టార్టప్‌లకు మద్దతు కల్పించేందుకు జాతీయ ఏఐ నిధి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా ఏఐ ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే "ఏఐ స్టార్టప్ విలేజ్"ను తెలంగాణలో ఏర్పాటు చేయడానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఏఐ రంగంలో విధానాలు, చట్టాలు, నైతిక ప్రమాణాలకు మార్గనిర్దేశం చేసే అత్యున్నత సంస్థగా ఇండియా ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రిని కోరారు. ఏఐ అభివృద్ధి సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలన, ప్రజా సేవల మెరుగుదల, జాతీయ భద్రతకు తోడ్పడేలా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బాధ్యతాయుతమైన, సమ్మిళిత, భవిష్యత్ దృష్టితో కూడిన ఏఐ వ్యవస్థను నిర్మించేందుకు ప్రపంచ నిపుణులు, సంస్థలు కలిసి పనిచేయాలని ఆయన కోరారు. ఈ మార్పు యుగంలో భారత్ నాయకత్వం వహించాల్సిన సమయం ఇదేనని ఆయన స్పష్టం చేశారు.

## మున్సిపల్ ఛైర్ పర్సన్‌కు కంది శ్రీనివాస రెడ్డి సత్కారం



(మొదటిపేజీ తరువాయి)

చాలా ఆనందంగా ఉందన్నారు. సెక్యులర్ పార్టీల మద్దతుతో ఇది సాధ్యపడిందన్నారు. బీఆర్ఎస్ ఎంఐఎమ్ పార్టీ నాయకులు , స్వతంత్ర కౌన్సిలర్లతో మాట్లాడి ఒప్పించగలిగామన్నారు. పట్టణ అభివృద్ధికి కృషి చేస్తూ ప్రజల మన్ననలు పొందాలని అనూషను కోరారు. తను నమ్ముకున్నవారికోసం తాను రాజకీయాల్లో కొనసాగుతున్నానన్నారు. తనకు పదవి దక్కేలా చేసిన కంది శ్రీనివాస రెడ్డికి బండారి అనూష సతీష్ ధన్యవాదాలు తెలిపారు. ఒక్కరూపాయి కూడా తమతో ఖర్చు పెట్టించకుండా ఒక ఆడబిడ్డకు కానుక ఇచ్చినట్టుగా తనకు మున్సిపల్ ఛైర్ పర్సన్ పదవిని కానుకగా ఇచ్చారన్నారు. నిత్యం ప్రజా సేవలో ఆదిలాబాద్ పట్టణ అభివద్ధికి తన శాయ శక్తులా పని చేస్తానని ఆమె అన్నారు. నమ్ముకున్నోళ్లకు కంది శ్రీనివాస రెడ్డి దేవుడు లాంటి వాడని బండారి సతీష్ అన్నారు. తనను నమ్ముకునే కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ ఛైర్మన్ సంతోష్ రావు కౌన్సిలర్లు మంగేష్, అన్నపూర్ణ, శాంతన్ రావు, రాందాస్ నాక్లే, సుధాకర్ గౌడ్, భూపల్లి శ్రీధర్ , శ్రీలేఖ, రఫీక్ పాల్గొన్నారు.

**నేడు బాధ్యతల స్వీకరణ**

కాగా ఆదిలాబాద్ మునిసిపల్ ఛైర్ పర్సన్‌గా బండారి అనూష శనివారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, పట్టణ ప్రముఖులు, వార్డు సభ్యులు హాజరుకావాలని ఆమె కోరారు. పట్టణ ప్రగతి కోసం రాజకీయాలకు అతీతంగా అందరి సహకారంతో పనిచేస్తానన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టు మరో ఊరట

**హైదరాబాద్, మహా** : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు మరో భారీ ఊరటను కల్పించింది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో నమోదైన పలు కేసుల్లో భూపాలపల్లి కోర్టు ముందు హాజరు కావడాన్ని మినహాయింపును కల్పిస్తూ తాజాగా హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఎన్నికల సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభల్లో రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగాలకు సంబంధించి ఆధారాలు లేకుండా తనపై తీవ్ర ఆరోపణలు చేశారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి చేసిన ఫిర్యాదుతో రేవంత్ రెడ్డిపై భూపాలపల్లి, మొగులపల్లి పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదయ్యాయి. తనపై నమోదైన ఈ రెండు కేసులను కొట్టి వేయాలని సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు ఆ రెండు కేసుల్లో భూపాలపల్లి కోర్టుకు ప్రత్యక్షంగా రేవంత్ రెడ్డి హాజరు కావడాన్ని మినహాయిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అదే సమయంలో ఈ కేసులకు సంబంధించి గండ్ర వెంకటరమణా రెడ్డి తరఫు లాయర్ కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కోరారు. దీంతో ఈ కేసులో తదుపరి విచారణను 3 వారాలకు వాయిదా వేస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది.

## మహాలక్ష్మి పథకం రీయింబర్స్ మెంట్ కోసం రూ.7,777 కోట్లు

- బడ్జెట్ లో కేటాయించాలన్న టీజీఎస్ఆర్ టీసీ
- జూన్ 2 నుంచి మహాలక్ష్మి పథకం కోసం స్మార్ట్ కార్డుల జారీ

**హైదరాబాద్, మహా :** మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ పథకానికి సంబంధించి ఆర్టీసీ కీలక ప్రతిపాదనలు చేసింది. మహాలక్ష్మి పథకంతోపాటుగా ప్రయాణ సౌకర్యాలు, ఇతర మౌలిక సదుపాయాల విస్తరణకు నిధుల్ని కోరింది. బడ్జెట్ ప్రతిపాదనల్లో రాష్ట్ర ప్రభుత్వానికి నిధుల కోసం రిక్వెస్ట్ చేసింది. మొత్తం రూ.7,777 కోట్లను మహాలక్ష్మి పథకానికి రీయింబర్స్‌మెంట్ కింద కేటాయించాలని కోరింది. 20262027 ఆర్థిక సంవత్సరంలో 680 కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, వీటి కోసం రూ.241.37 కోట్లు అవసరమని కూడా కోరింది. బస్టాండ్‌ల నిర్మాణం, కొత్త డిపోలు, రుణాల చెల్లింపుల కోసం రూ.855 కోట్లు కోరింది. మౌలిక వసతులకు సంబంధించి రూ.442.61 కోట్లు,.. ఆయా వర్గాలకు బస్‌పాస్‌లకు సంబంధించి రూ.358 కోట్లు ప్రతిపాదించింది. తెలంగాణ రవాణాశాఖ కూడా ప్రతిపాదనల్లో.. 20262027 ఆర్థిక సంవత్సరంలో రూ.7,519 కోట్ల ఆదాయాన్ని సమకూరుస్తామని తెలిపింది. మరోవైపు మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి సంబంధించి ప్రభుత్వం మరో తీపికబురు చెప్పింది. త్వరలోనే రాష్ట్రంలో మహిళలకు మహాలక్ష్మి స్మార్ట్ కార్డులను జారీ చేసేందుకు సిద్ధమవుతోంది. మహాలక్ష్మి స్మార్ట్ కార్డుల పేరుతో జూన్ 2వ తేదీ నుంచి జారీ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ మహాలక్ష్మి స్మార్ట్ కార్డుల కోసం రూ.75 కోట్లు కేటాయించింది. మహిళలు ఉచిత బస్సు ప్రయాణం కోసం ఆధార్ కార్డును బస్ కండక్టర్లకు చూపించాల్సి ఉంటుంది. అయితే ఆధార్ కార్డు కాకుండా మహాలక్ష్మి స్మార్ట్ కార్డులు అందుబాటులోకి వస్తే వీటిని చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాలు చేసేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్టీసీ ప్రతిపాదనల్లో కొత్త బస్సులతో పాటుగా, బస్టాండ్‌లు, డిపోలు కూడా ఉన్నాయి. కొత్త బస్సులు అందుబాటులోకి వస్తే మహాలక్ష్మి పథకానికి ఇబ్బందులు లేకుండా పోతాయి. .బస్సుల్లో రద్దీ తగ్గుతుంది. కొత్త డిపోలు, బస్టాండ్‌లు కూడా ఎంతో ఉపయోగంగా ఉంటాయని అధికారులు అంటున్నారు.

## ఓవైసీ బ్రదర్స్‌పై రాజాసింగ్ ఫైర్

- 15 ఏళ్ల సమయమిచ్చినా ఏంచేయలేరని వ్యాఖ్య
- నాకు 5 నిమిషాలు ఇచ్చే దమ్ముందా అని ప్రశ్న
- మీ పూర్వీకులే హిందువులను ఏం చేయలేకపోయారన్న రాజాసింగ్

**వరంగల్, మహా :** మజ్లిస్ పార్టీ, ఒవైసీ సోదరులపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మీరు 15 నిమిషాలు అడిగారు, కానీ నాకు ఐదు నిమిషాల సమయం ఇచ్చే దమ్ముందా అని ప్రశ్నించారు. వరంగల్ లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాజాసింగ్ మాట్లాడుతూ, తమకు 15 నిమిషాల సమయం ఇస్తే హిందువులు లేకుండా చేస్తానని అన్నారని మండిపడ్డారు. 15 నిమిషాలు కాదు 15 గంటలు, 15 రోజులు, 15 నెలలు అవసరమైతే 15 సంవత్సరాలు ఇచ్చినా మీరేం చేయలేరని అన్నారు. మీ పూర్వీకులే హిందువులను ఏం చేయలేకపోయారు మీరేం చేస్తారని మండిపడ్డారు. కానీ మాకు ఐదు నిమిషాల సమయం ఇవ్వాలని అన్నారు. తాను ఎక్కడకు రావాలో చెప్పాలని అన్నారు. నీ ప్రాంతానికి రావాలా, నీ ఇంటికి రావాలా, ఎక్కడకు రమ్మంటే అక్కడకు వస్తానని అన్నారు. తనకు కత్తి, తుపాకీ ఏదీ వద్దని వ్యాఖ్యానించారు.

## రూ.70 వేల కోట్ల హైదరాబాద్ బిర్యానీ కుంభకోణం

- ఐ టూల్స్ తో పట్టేసిన ఐటీ అధికారులు
- 2019 నుంచి జరుగుతున్న తంతు

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో మొదలైన చిన్న తనిఖీ దేశవ్యాప్తంగా ఏకంగా రూ.70 వేల కోట్ల బిర్యానీ కుంభకోణాన్ని బయటపెట్టింది. బిల్లులను తక్కువగా చేసి చూపించి ప్రభుత్వానికి కట్టే పన్నులను ఎగ్గొట్టినట్లు ఐటీ అధికారులు గుర్తించారు. అయితే ఏఐ టూల్స్ ఉపయోగించి.. ఈ భారీ స్కామ్‌ను వెలుగులోకి తీసుకువచ్చారు. ఏకంగా 1.77 లక్షల రెస్టారెంట్ల నుంచి 60 టీబీల బిల్లింగ్ డేటాను విశ్లేషించిన అధికారులు ఈ కుంభకోణాన్ని ప్రపంచానికి తెలియజేశారు. బిల్లింగ్ సాఫ్ట్‌వేర్‌లో అవకతవకలను గుర్తించి.. తనిఖీలు చేయగా ఈ అసలు మోసం వెలుగులోకి వచ్చింది. బిల్లులను పూర్తిగా డిలీట్ చేయడం, తగ్గించడం వంటి పద్ధతులతో 2019 నుంచి ఈ మోసం జరిగినట్లు తాజా విచారణలో వెల్లడైంది. కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో ఈ పన్ను ఎగవేత అధికంగా ఉన్నట్లు తేల్చారు. దాదాపు 27 శాతం అమ్మకాలను లెక్కల నుంచి తొలగించారని అధికారులు నిర్ధారించారు. అయితే ఇది ఇప్పటివరకు దొరికిందేనని విచారణ జరిపితే మరింత ఎక్కువ స్కామ్ బయటపడుతుందని తెలిపారు. హైదరాబాద్‌లోని ఓ బిర్యానీ హోటల్‌లో మొదలైన చిన్న తనిఖీ, దేశవ్యాప్తంగా దాదాపు 70 వేల కోట్ల భారీ పన్ను ఎగవేతను బయటపెట్టింది. చాలా హోటళ్లు భారీగా లాభాలు సంపాదిస్తున్నా, ప్రభుత్వానికి మాత్రం తక్కువ ఆదాయం వస్తున్నట్లు చూపిస్తున్నాయి. ఇలా పన్నులు కట్టకుండా తప్పించుకుంటున్నారని పోలీసులు గుర్తించారు. సమాచారం ప్రకారం, గత కొన్నేళ్లుగా ఇలా దాదాపు 70వేల కోట్ల దాకా పన్ను ఎగవేత జరిగినట్లు తెలుస్తోంది. హోటళ్లలో కస్టమర్లు తిన్న ఫుడ్‌కు సిస్టమ్ జనరేటెడ్ బిల్ తయారు చేసేందుకు ఉపయోగించే ఒక సాఫ్ట్‌వేర్ ద్వారా ఐటీ అధికారులు ఈ మోసాన్ని మొదట వెలుగులోకి తీసుకువచ్చారు. హైదరాబాద్‌లో దొరికిన తీగను లాగితే దేశవ్యాప్తంగా డొంక కదలింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో లక్షలాది హోటళ్లు ఒకే రకమైన సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సుమారు 1.77 లక్షల హోటళ్ల రికార్డులు 60 టెరాబైట్ల సమాచారాన్ని ఏఐ, జనరేటివ్ ఏఐ, బిగ్ డేటా అనలిటిక్స్ టూల్స్‌ను ఉపయోగించి ఈ కుంభకోణాన్ని బయటికి తీశారు. రెస్టారెంట్లలో అవకతవకలు జరగకుండా ఉండేందుకు నగదు, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, యూపీఐ ద్వారా వచ్చే ప్రతి పైసాను సాఫ్ట్‌వేర్‌లో స్టోర్ చేస్తారు. అయితే ప్రభుత్వానికి చెల్లించే ట్యాక్సులను తప్పించుకునేందుకు కొన్ని రెస్టారెంట్లు రకరకాల పద్ధతులను పాటించినట్లు గుర్తించారు. ప్రధానంగా బిల్లులను ఎంపిక చేసి డిలీట్ చేయడం, కొన్ని రోజుల పాటు బిల్లింగ్ డేటాను సాఫ్ట్‌వేర్ నుంచి పూర్తిగా తొలగించినట్లు అధికారుల విచారణలో తేలింది. ఉదాహరణకు ఒకచోట రూ.2,784 బిల్లును కేవలం రూ.27కి తగ్గించినట్లు గుర్తించారు. ఏఐ డేటా విశ్లేషణలో దేశవ్యాప్తంగా రూ.13,317 కోట్ల విలువైన బిల్లులను డిలీట్ చేసినట్లు తేలింది. కేవలం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోనే రూ.5,141 కోట్ల అమ్మకాలను మాయం చేసినట్లు తెలిపారు. 40 రెస్టారెంట్లలో నిర్వహించిన తనిఖీల్లో సుమారు రూ. 400 కోట్ల పన్ను ఎగవేసినట్లు బయటపడింది. ట్యాక్స్ ఎగవేత అధికంగా ఉన్న తొలి 5 రాష్ట్రాల్లో తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ ఉన్నాయి. కర్ణాటక రూ.2 వేల కోట్ల బిల్లుల తొలగింపుతో మొదటి స్థానంలో ఉండగా.. తెలంగాణ రూ.1,500 కోట్లు.. తమిళనాడు రూ.1,200 కోట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మొత్తం అమ్మకాల్లో సగటున 27 శాతం ఆదాయాన్ని రెస్టారెంట్లు తక్కువగా చూపించినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

# సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెడితే చర్యలు తప్పవు

**ఆమనగల్లు ఎస్సై బి. వెంకటేష్ హెచ్చరిక**



**ఆమనగల్లు, మహా :** సోషల్ మీడియా ద్వారా విద్వేష పూరిత వ్యాఖ్యలు, రెచ్చగొట్టే పోస్టులు పెట్టకూడదని ఆమనగల్లు ఎస్సై బి వెంకటేష్ సూచించారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా దృశ్యరూపంలో చేసే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజకీయ, కుల, మత, ప్రాంతీయ వివాదాలకు ఇచ్చేలా వ్యవహరించకూడదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏదైనా పోస్టులు, వీడియోలు, ఫోటోలు, సామాజిక మధ్యమాల్లో షేర్ చేసినట్లయితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు, వాట్సాప్, ఫేస్బుక్, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్, వంటి సామాజిక మాధ్యమాల్లో ఇతరులకు హాని కలిగించవద్దన్నారు, ఏదైనా వర్గాన్ని కించపరిచేలా తెలియని సమాచారాన్ని పోస్ట్ చేయడం, షేర్ చేయడం నేరంగా పరిగణించబడుతుందన్నారు. ఒక గ్రూపులో ఇలాంటి పోస్టులు చేరితే ఆ గ్రూప్ అడ్మిన్ కూడా బాధ్యతగా పరిగణించబడతారని తెలిపారు. ఇలాంటి చర్యలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి 24 * 7 పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు అనుచిత పోస్టులను ఫార్వర్డ్ చేసిన వారిపై కేసులు నమోదు చేపడుతామని. కాబట్టి సామాజిక మాధ్యమాలను సమాజానికి మంచి చేకూర్చే విధంగా మాత్రమే ఉపయోగించుకోవాలని నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

# పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలి

**ఏబీవీపీ నాయకులు**



**రాజేంద్రనగర్, మహా ;** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ ఆధ్వర్యంలో పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ వెంటనే విడుదల చేయాలని శంషాబాద్ జోన్ పరిధిలో శుక్రవారం భారీ ధర్నా నిర్వహించారు. శంషాబాద్ విభాగ్ కన్వీనర్ ప్రదీప్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 8500 కోట్ల ఫీజు రీయంబర్స్మెంట్ స్కాలర్షిప్ పెండింగ్లో ఉన్నాయి. దీని కారణంగా వేలాదిమంది విద్యార్థులు రోడ్ల పైకి వచ్చే పరిస్థితి నెలకొంది. విద్యార్థుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయిన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడం చాలా దురదృష్టకరము. పరిపాలన ఇలాగే కొనసాగిస్తే రాబోయే రోజుల్లో ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ జిల్లా కన్వీనర్ దార పవన్ కళ్యాణ్ , రాష్ట్ర ఖేల్ కో కన్వీనర్ అఖిల్, రాష్ట్రా కార్యవర్గ సభ్యులు మహిపాల్, భరత్, విజయ్, చందు వివేకానంద తిరుపతి, దినేష్ ,మేఘన , హారిక , అఖిల తదితర విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నాపై నమ్మకంతో గెలిపించినందుకు ధన్యవాదాలు..

- **బిజెపితోనే అభివృద్ధి సాధ్యం..**
- **మొయినాబాద్ 4వ వార్డు కౌన్సిలర్ షాబాద్ కిషన్**



**మొయినాబాద్ మహా:** తనపై నమ్మకంతో గెలిపించినందుకు 4వ వార్డు ప్రజలకు తన గెలుపుకు కృషి చేసిన బీజేపీ నాయకులు కార్యకర్తలు అభిమానులకు మొయినాబాద్ మున్సిపల్ 4వ వార్డు కౌన్సిలర్ షాబాద్ కిషన్ ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ పార్టీపై అభిమానంతో... తనను గెలిపించినందుకు 4వ వార్డులోని ప్రజలకు అందుబాటులో ఉండి ఎటువంటి ఇబ్బందులు ఉన్న అండగా ఉంటానని చెప్పారు. 4వ వార్డు ను మరింత అభివృద్ధి పథంలో ఉంచడానికి ప్రజలందరి పక్షాన కలిసి నడుద్దామని ఆయన కోరారు.

# ఉప్పల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ కు షాక్

**చిలుకానగర్ లో భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరిక**



**కుషాయిగూడ, మహా :** పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దోపిడీ చేశారని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ పరమేశ్వర్ రెడ్డి ఆరోపించారు. అభివృద్ధి, సంక్షేమం ముసుగులో బీఆర్ఎస్ నాయకులే దోచుకున్నారన్నారు. చిలుకానగర్ డివిజన్ లో బీఆర్ఎస్ కార్యకర్తలు పలువురు కాంగ్రెస్ లో చేరారు, ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, మొన్నటి వరకు కార్పొరేటర్ గా చేసిన వ్యక్తి "బన్నాల పన్ను" పేరుతో భారీగా వసూళ్లకు పాల్పడినట్టుగా పరమేశ్వర్ రెడ్డి ఆరోపించారు. హైకోర్టు కాలనీ సమీపంలో రూ.100 కోట్ల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారన్నారు. ఇదే కాదు ఇలాంటివి ఎన్నో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన నడుస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల అమలతో అన్ని పార్టీల దృష్టి కాంగ్రెస్ వైపు మళ్లీందన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో రమణ, చెర్ల బలరాం, కొంద్ర రాములు, మారేపాక సాయిలు, పోలాటి కిష్టయ్య, కూరెల్లి యాదగిరి, రాం నర్సయ్య, సిహెచ్ ఐలయ్య, మారేపాక నాగయ్య, బి అంజయ్య, ఎస్ నరసింహ, పోడిశెట్టి కృష్ణ, ఎం శ్రీనివాస్, జి రాములు, ఎం శ్రీనివాసరావు, రవి, మురళి, బాబురావు, కనకరాజు, ఎల్ల స్వామి, రాజేందర్, సలేందర్, కోటి, కార్తీక్, భాస్కర్, వెంకటస్వామి, పోచయ్య, బాలకృష్ణ, రామకృష్ణ, మహేష్, రాములు, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్, ఆగిటి ఆగం రెడ్డి, బజారు జగన్నాథ్ గౌడ్, కొంపల్లి బాలరాజు, ఏ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, లింగంపల్లి రామకృష్ణ, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, అమరేశ్వరి గారు, సుశీలమ్మ గారు, మంచాల రఘు, శ్రీరాములు , మహేందర్ ముదిరాజ్, గండికోట గణేష్, దుడుగుల శంకర్, అమర్, మోయునుదిన్, సత్యం, భాస్కర్ రెడ్డి, చంద్రయ్య, రాధాకృష్ణ, శ్రావణ్, జగన్, రవి, శివ , డేవిడ్, చాంద్ పాషా,కిరణ్ లు ఉన్నారు.

# కీసరగుట్ట మహాశివరాత్రి ఆదాయం రూ. 92,70,762

**కుషాయిగూడ, మహా :** మేడ్చల్ జిల్లా కీసరగుట్ట లో జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో కీసరగుట్ట దేవస్థానం ఆదాయం రూ. 92,70,762 గా నమోదైంది. ఈ నెల 13వ తేదీ నుండి 18వ తేదీ వరకు జరిగిన బ్రహ్మోత్సవాల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. హుండీ ద్వారా రూ. 28,36,837, అభిషేకాల ద్వారా రూ. 6,23,700, స్వామివారి కళ్యాణం ద్వారా రూ. 50,785, ప్రసాదాల విక్రయం ద్వారా రూ. 27,27,500, ప్రత్యేక దర్శనాలు మరియు ఇతర సేవల ద్వారా రూ. 27,08,840, ఆన్లైన్ సేవల ద్వారా రూ. 3,23,100 ఆదాయం సమకూరింది. మొత్తం రూ. 92,70,762 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా అన్నదానం, అర్చక సేవలు, స్వచ్ఛంద సేవలు విస్తృతంగా నిర్వహించారు. భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారి దర్శనం చేసుకున్నారు.

# బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ పాలకవర్గం

**చైర్మన్ పత్య నాయక్, వైస్ చైర్మన్ గీత భాద్యతల స్వీకరణ.. ప్రజల సహకారంతో పారదర్శక పాలన**



**అమనగల్లు, మహా :**ఆమనగల్లు, మహా :మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొంది ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన కౌన్సిలర్ సభ్యులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయంలో పూజారులతో ప్రత్యేక పూజలు చేయించారు. చైర్మన్ పత్య నాయక్ ,వైస్ చైర్మన్ తల్లోజు గీత ఆచారి,కౌన్సిలర్లు సంతకాలు చేసి బాధ్యతలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ వారికి బాధ్యతలు అప్పగించారు. ఈ పదవి భాద్యతల స్వీకరణకు ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి,జాతీయ ఓబిసి మాజీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి హాజరయ్యారు.

**మున్సిపాలిటీ అభివృద్ధి తన ప్రధాన లక్ష్యం**
**చైర్మన్ పత్య నాయక్**

ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధి తన ప్రధాన లక్ష్యమని, పట్టణంలో మౌలిక వసతుల మెరుగుదల, శుభ్రత, తాగునీరు, రోడ్లు, కాలువలు వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సహకారంతో పారదర్శక పాలన అందిస్తానని హామీ ఇచ్చారు.మున్సిపల్ పరిధిలో చాలా సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, ప్రతీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తెలియజేయాలని, అన్ని విధాల అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు.

**పాలకవర్గంతో కలిసి సమన్వయంతో కృషి చేస్తాం**
**వైస్ చైర్మన్ తల్లోజు గీత ఆచారి**

మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి పాలకవర్గంతో కలిసి సమన్వయంతో కృషి చేస్తానని వైస్ చైర్మన్ తల్లోజు గీత తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల మెరుగుదల, శుభ్రత,తాగునీటి సరఫరా, రోడ్ల అభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.మున్సిపల్ సిబ్బంది నూతన పాలకవర్గం సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని పలువురు నాయకులు,ప్రజాప్రతినిధులు, అధికారులు నూతన పాలకవర్గాన్ని శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు కౌన్సిలర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**బిఆర్ఎస్ అహంకారంతోనే**
**అందుకే కాంగ్రెస్తో పొత్తు: ఆచారి**

మున్సిపల్ ఎన్నికలలో బీఆర్ఎస్ నాయకుల అహంకారపు మాటలకు బుద్ధి చెప్పేందుకే సిద్ధాంతాలు వేరైనా కాంగ్రెస్తో మున్సిపాలిటీలో జతకట్టినట్లు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి చెప్పారు. శుక్రవారం ఆమనగల్లు మున్సిపాలిటీ నూతన పాలకవర్గాన్ని ఆయన అభినందించి మాట్లాడారు. కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో లేని ఆ పార్టీతో అభివృద్ధి జరగదన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి కాంగ్రెస్కు సహకరిస్తామని చెప్పారు.

**మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చెయాలి :ఎమ్మెల్యే కసిరెడ్డి**

ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి నూతనంగా ఏర్పాటైన పాలకవర్గ సభ్యులు చిత్తశుద్ధితో ఈ కృషి చేయాలని కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి సూచించారు. ఆమనగల్లు మున్సిపల్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం నూతన పాలకవర్గ సభ్యులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తదితరులు,అభినందించారు.సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు. ప్రజలు ఎంతో నమ్మకంతో మీకు అధికారం అప్పగించారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పిబిసి సభ్యులు బాలాజీ సింగ్,పిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్,ఎఎంసి చైర్మన్ యాట గీత,బ్లాక్ అధ్యక్షులు యాట నర్సింహా,మాజీ జెడ్పిటిసి కండె హరిప్రసాద్, కౌన్సిలర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్ మహా ;** నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. మైలర్ దేవ్ పల్లి డివిజన్ లోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో శుక్రవారం సుమారు 9కోట్ల .80 లక్షల రూపాయలతో చేపట్టే సిసి రోడ్, అండర్ డ్రైనేజీ పనులకు స్థానికులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాము. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం సహకారం అందిస్తుంది అన్నారు. స్థానిక ఎమ్మెల్యేగా ప్రజా సమస్యలను తెలుసుకుంటూ దశలవారీగా సమస్యలకు పరిష్కారం చూపిస్తునన్నారు. అభివృద్ధి పనులకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి హెచ్ఎం డబ్ల్యూ ఎస్, ఎస్ బి అధికారులు నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# శిలాఫలకాలపై పేర్ల కోసం ఓ ప్రజా ప్రతినిధి తహతహలాడుతున్నారు

**మాజీ కార్పొరేటర్ తోకల**



**రాజేంద్రనగర్ మహా ;** రెండుసార్లు కార్పొరేటర్ గా అవకాశం కల్పించిన డివిజన్ ప్రజలకు కృతజ్ఞతలు.ఐదు సంవత్సరాల్లో మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో సుమారు 114 కోట్ల తో అభివృద్ధి పనులు చేశాము. సహకరించిన జిహెచ్ఎంసి అధికారులకు పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ బిజెపి కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. అభివృద్ధికి ఎన్నో ఆటంకాలు ఎదురైన జిహెచ్ఎంసి కౌన్సిల్లో పోరాడి నిధులు రాబట్టాను. 114 కోట్ల నిధులతో డివిజన్ పరిధిలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, సిసి రోడ్లు పనులు ప్రారంభించాము. డివిజన్ పరిధిలో 312 పనులు, 90 శాతం సిసి రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు సుమారుగా పూర్తి చేశాం. కార్పొరేటర్ గా తన పదవీకాలం పూర్తయింది. మిగిలిన కొద్ది గొప్ప పనులన అధికారుల అండతో పూర్తి చేపిస్తానన్నారు. తన పదవి కాలం పూర్తయిన తర్వాత ఓ ప్రజా ప్రతినిధి శిలాఫలకాలపై పేర్ల కోసం తహతహలాడుతూ శంకుస్థాపనలు చేస్తున్నారు. ఎంపీ నిధులతో ఎంపీకి సమాచారం లేకుండా శంకుస్థాపనలు చేస్తున్నారు. మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో కార్పొరేటర్ గా తాను కౌన్సిల్లో పోరాడి నిధులు రాబట్టాను, ఆ నిధులతో నేడు శిలాఫలకాలపై పేర్ల కోసం శంకుస్థాపనలు చేస్తున్నారు. ప్రజా ప్రతినిధిగా ఐదు సంవత్సరాలు అభివృద్ధిని అడ్డుకుంటూ కార్పొరేటర్ గా తనను బిజెపి కార్యకర్తలను నానా ఇబ్బందులకు గురి చేశారు. నేడు చేస్తున్న శంకుస్థాపనలు ఐదు సంవత్సరాలుగా ఎటు వెళ్లారని మాజీ కార్పొరేటర్ తోకల ప్రశ్నించారు.ప్రజా ప్రతినిధిగా మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం ప్రభుత్వంతో పోరాడుతూ నిధులను రాబట్టి అభివృద్ధి పనులు చేశాము.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్ వి కర్ణన్ సహకారంతో డివిజన్ పరిధిలోని కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసాం. మైలార్దేవ్పల్లి డివిజన్ ప్రజలు రెండుసార్లు కార్పొరేటర్గా అవకాశం కల్పించారు వారికి మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పాండు యాదవ్, రావుల భాస్కర్, బుచ్చిరెడ్డి, సంతోష్ గౌడ్, అడికె జనార్ధన్, ఎల్ వి రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, బబ్లూ, ఎన్ను శంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ప్రభుదాస్, పృధ్వీ రాజ్, రఘునాథ్, రాజ్ కుమార్, గోపాల్ నాయక్, కుర్మయ్య, బిరామ కృష్ణ, రామ రావు, శేఖర్, సురేష్, దినకర్, శంకర్, శ్రవణ్, పార్టీ కార్యకర్తలు తదు పాల్గొన్నారు.

# పరిశోధనలు సమాజానికి ఉపయోగపడాలి

**చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ ఛాన్సలర్ సీ.హెచ్.వీ.పురుషోత్తం రెడ్డి**



**మొయినాబాద్ మహా:** పరిశోధనలు సమాజానికి ఉపయోగపడాలని చైతన్య డిమ్డ్ టూబీ యూనివర్సిటీ ఛాన్సలర్ సీ.హెచ్.వీ.పురుషోత్తం రెడ్డి పేర్కొన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ లో గల చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో "స్కిన్ డిసీస్ డిటెక్షన్ అండ్ క్లాసిఫికేషన్ యూజింగ్ డీప్ లెర్నింగ్ మోడల్స్ " అనే తన పరిశోధన సిద్ధాంతానికి కుంభం శ్రీలతకి పీ.హెచ్.డీ డిగ్రీ పట్టా లభించగా.. యూనివర్సిటీ ఛాన్సలర్ సీ హెచ్. వీ.పురుషోత్తం రెడ్డి చేతుల మీదగా అధికారికంగా ప్రధానం చేశారు. ఈ పరిశోధన డాక్టర్ ఈ.సాయి కిరణ్ పర్యవేక్షణలో ఈ ఘనత సాధించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఛాన్సలర్ సీ.హెచ్. వీ. పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ... కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో పరిశోధనలు జాతీయ అభివృద్ధికి ఎంతో కీలకమని అన్నారు. డీప్ లెర్నింగ్ ఆధారంగా చర్మ రోగాల గుర్తింపు మరియు వర్గీకరణ పై చేసిన ఈ పరిశోధన అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి పరిశోధనలు దేశానికి గర్వకారణమే కాకుండా భవిష్యత్తు అభివృద్ధికి బలమైన పునాదిని ఏర్పరుస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య జీ.శంకర్ లింగం, రిజిస్టర్ ఆచార్య యం.రవీందర్, క్రిస్టోఫర్, ఏ.రాజు, ఎం.జగదీశ్వర్, బీ.రాజేందర్ రెడ్డి, డాక్టర్ ఈ.అరవింద్ రెడ్డి, డాక్టర్ ఈ.సాయి కిరణ్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ గాదె రాంబాబు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ తొలి శుక్రవారం ప్రార్థనలు



**ఆమనగల్లు, మహా :** పవిత్ర రంజాన్ మాసం మొదటి శుక్రవారంను ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కడ్తాల మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రంలోని మస్జిద్ కుబా మస్జిద్ అర్షద్ లలో మసీదు ఇమామ్ లు జహీరుద్దీన్, తహజీబ్ ఆలం ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా మసీదు కమిటీ ల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, పాడి పంట అభివృద్ధి చెందాలని అల్లాహ్ ను ప్రార్థించారు. మసీదు కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రవూఫ్, అహ్మద్ జానీ ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు:ఎమ్మెల్యే



**ఆమనగల్లు, మహా :** అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు. శుక్రవారం మైసిగండిలో నిర్మాణం పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇళ్లను టిపిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ చైర్మన్ యాట గీత ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగంచేసుకోవాలని కోరారు. సర్పంచ్ ప్రేమ జవహర్ లాల్,ఉపసర్పంచ్ హరా సింగ్,యాద గిరి రెడ్డి, మాజీ సర్పంచ్ తులసిరామ్, వార్డు సభ్యులు బుజ్జి,చందన్, సుమన్, రాజు, కృష్ణ, ధోలీ,మాజీ వార్డు సభ్యులు తులసిరామ్ ,సాయికుమార్ ,షాబుద్దీన్, చందుజి తదితరులు ఉన్నారు.

# బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ సస్పెన్షన్..



**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో యెన్కెపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గొంగళ్ళ రితీష్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) మండల నాయకత్వం ప్రకటించింది. మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. రితీష్ రెడ్డి పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తూ.. పార్టీలో కొనసాగుతూనే ఇతర పార్టీలకు మద్దతు ఇచ్చారని ఆరోపించారు. పార్టీ కార్యకర్తలను తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరించడం వల్ల పార్టీకి నష్టం కలిగిందని మండల నాయకత్వం అభిప్రాయపడింది. గత ఐదు సంవత్సరాలుగా బీఆర్ఎస్ తరఫున ఎంపీటీసీగా గెలిచి పార్టీ ఆశీర్వాదంతో పదవి పొందిన వ్యక్తిగా ఉండి, అదే పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించడం తీవ్రంగా విచారకరమని పేర్కొన్నారు. ఈ వ్యవహారాన్ని సమగ్రంగా పరిశీలించిన అనంతరం క్రమశిక్షణాత్మక చర్యగా వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు శ్రీ గొంగళ్ళ రితీష్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు.

# క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి



- **ఘనంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి సీఎం కప్ కోకో పోటీలు..**
- **క్రీడా జ్యోతిని వెలిగించిన కలెక్టర్ బి. చంద్రశేఖర్..**
- **హోరాహోరీగా సాగుతున్న క్రీడా సమరం..**

**నల్గొండ, మహా :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మేకల అభినవ స్టేడియంలో రాష్ట్రస్థాయి 'సీఎం కప్' జూనియర్ బాలబాలికల కోకో పోటీలను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్తో కలిసి ఆమె ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం శాంతికి చిహ్నంగా పావురాలను, రంగురంగుల బెలూన్లను ఆకాశంలోకి వదిలారు .ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలో మాణిక్యాలను వెలికితీయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతి ఏటా సీఎం కప్ నిర్వహిస్తోందని తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్నే కాకుండా శారీరక దృఢత్వాన్ని ఇస్తాయని తెలంగాణ ప్రభుత్వం క్రీడారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. 33 జిల్లాల నుంచి క్రీడాకారులు గ్రామ స్థాయి నుంచి కష్టపడి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఇలాంటి పోటీల నుంచే రేపటి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు తయారవుతారని ఆకాంక్షించారు. నల్గొండ జిల్లాలో ఈ మెగా టోర్నీ నిర్వహించడం గర్వకారణమని క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించామని స్పష్టం చేశారు.ఈ వేడుకలో జిల్లా యువజన క్రీడా అధికారి అక్బర్ అలీ జెడ్పీ సీఈవో శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి, కార్పొరేటర్ ఖలీల్, వివిధ విభాగాల అధికారులు, కోచ్లు మరియు భారీ సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. మొదటిరోజు జరిగిన మ్యాచ్ల్లో క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి ప్రేక్షకులను అలరించారు.

# బీసీల తడాఖా చూపిస్తాం.. రిజర్వేషన్లు తగ్గితే యుద్ధమే!

- **నల్గొండ కలెక్టరేట్ను ముట్టడించిన బీసీ విద్యార్థి సంఘం..**
- **42 శాతం కోటా ఇస్తేనే ఎన్నికలకు వెళ్లాలి.. అయితగోని జనార్దన్ గౌడ్**
- **మంత్రులను తిరగనివ్వం ఆర్.కృష్ణయ్య హెచ్చరిక..**




**నల్గొండ మహా :** బీసీలను ఇంకెన్నిసార్లు మోసం చేస్తారు? మా హక్కుల కోసం తడాఖా చూపిస్తాం.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోతే రాష్ట్రంలో యుద్ధం తప్పదు అని బీసీ విద్యార్థి సంఘం నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు కోరుతూ శుక్రవారం నల్గొండ జిల్లా కలెక్టరేట్ను బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ముట్టడించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది.ఈ ముట్టడిని ఉద్దేశించి బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 42 శాతానికి పెంచకుండా, పాత పద్ధతిలో 17 శాతం తగ్గించి ఎన్నికలకు వెళ్లడం బీసీ ద్రోహమే అవుతుందన్నారు. బీసీల ఓట్లు కావాలి కానీ, వారికి రావాల్సిన రాజ్యాంగబద్ధమైన వాటా ఇవ్వరా? అని ఆయన నిలదీశారు. ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

**ఆర్.కృష్ణయ్య హెచ్చరిక**
**"మంత్రులను తిరగనివ్వం"**

ఈ పోరాటానికి మద్దతుగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. గత ఏడాది కాలంగా రాష్ట్రవ్యాప్తంగా 100కు పైగా ధర్నాలు, సత్యాగ్రహాలు, చివరకు రాష్ట్ర బంద్ నిర్వహించినా ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ఉద్యమాలను అణిచివేయాలని నాయకులను బెదిరించాలని చూస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో కోర్టు తీర్పులు వ్యతిరేకంగా వచ్చినా అక్కడి వారు మౌనంగా ఉన్నారని కానీ మన రాష్ట్రంలో బీసీ ఉద్యమం పల్లె పల్లెకు పాకి ప్రజా ఉద్యమంగా మారిందని గుర్తుచేశారు. హైకోర్టులో కేసు పెండింగ్లో ఉండగానే ఈ నెల 23న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలనే ప్రభుత్వ ఆలోచనను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. బీసీలకు న్యాయం జరిగే వరకు మంత్రులను గ్రామాల్లో తిరగనివ్వబోమని హెచ్చరించారు.బీసీల విషయంలో రాజకీయ పార్టీలు అనుసరిస్తున్న తీరును నాయకులు తప్పుబట్టారు. కోర్టులో కేసు 100 శాతం బీసీలకు అనుకూలంగా వస్తుందనే భయంతోనే ప్రభుత్వం హడావుడిగా ఎన్నికలకు వెళ్తోందని విమర్శించారు. బీసీలందరూ ఏకమై తమ సత్తా చాటాలని ఇప్పుడు గనుక 42 శాతం సాధించకపోతే భవిష్యత్తులో బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందని పిలుపునిచ్చారు.ఈ ముట్టడి కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు మేడబోయిన సాయి కుమార్, అనంత్ నాగరాజు గౌడ్, కొంపెల్లి రామన్న గౌడ్, కుందారపు శివ, తాడూరి మహేష్, వీరేటి కృష్ణ, అంబటి స్వామి, భాష పాక శ్రీహర్ష, బైరగోని చందు, గుండబోయిన చరణ్ తేజ, మేడబోయిన తరుణ్ కుమార్ యాదవ్, సుంకరి గణేష్, గుంద్ర గణేష్, రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు

ABN తెలుగు
మహా పత్రిక
గురువారం, హైదరాబాద్
21-02-2026
మహా ప్రత్యేకం


## ఆవిష్కరణతో సమగ్ర అభివృద్ధి

- 2026లో భారతదేశం ఒక కొత్త దిశలో అడుగులు వేస్తోంది.
- ఏఐ ద్వారా అందరికీ అందుబాటులో ఆరోగ్యం
- అనుభవపూర్వక రిటైల్ ద్వారా వినియోగదారునికి విలువ
- బయోటెక్ ద్వారా జీవరక్షక పరిష్కారాలు
- విద్యలో వ్యక్తిగత అభ్యాస పథాలు
- సామాజిక రంగంలో కమ్యూనిటీ ఆధారిత మార్పు
- సాంకేతికతను మానవతతో మేళవించడం- ఇదే భారత ఆవిష్కరణల అసలైన శక్తి.

## నూతన మైలురాళ్లు

ఏఐ హెల్త్ టెక్ నుండి అనుభవపూర్వక రిటైల్ వరకు, బయోటెక్ నుండి సామాజిక ఆవిష్కరణ వరకు—2026లో భారతీయ స్టార్టప్‌లు, శాస్త్రవేత్తలు, వ్యవస్థాపకులు ప్రపంచ వేదికపై తమ ముద్ర వేస్తున్నారు. దేశ ఆర్థికాభివృద్ధికి తోడు సమానత్వం, స్థిరత్వం, మానవ కేంద్రిత దృక్పథం ఇవన్నీ కలగలిపిన నవ భారతం.

# ఆవిష్కరణల నవ భారతం

## 2026 ఏఐ, బయోటెక్ రంగాలకు నూతన శకం

## ఆవిష్కరణలతో అభివృద్ధి - అభివృద్ధితో సమానత్వం

(మహా ప్రత్యేకం)

ఆవిష్కరణలతో భారత్ దూసుకుపోతోంది. ఏఐతో వేగవంతమైన వ్యాపార మార్పులు, బయోటెక్‌లో జీవరక్షక పరిష్కారాలు, డిజిటల్ విద్య ద్వారా సమాన అవకాశాలు, వెల్నెస్ రంగంలో సమగ్ర దృష్టి – ఇవన్నీ కలిసినప్పుడు భారతదేశం ప్రపంచ ఆవిష్కరణ కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. సాంకేతికతను మానవతా దృక్పథంతో మిళితం చేయడం – ఇదే 2026లో భారత ఆవిష్కరణల అసలు సందేశం. విజ్ఞానం, దూరదృష్టి, సామాజిక బాధ్యత – ఈ మూడు విలువలతో భారతీయ మార్గదర్శకులు ప్రపంచానికి ఒక కొత్త మోడల్‌ను అందిస్తున్నారు. 2026 సంవత్సరం భారతదేశ ఆవిష్కరణ రంగానికి ఒక మలుపు తిరిగిన దశగా నిలుస్తోంది. కృత్రిమ మేధస్సు , బయోటెక్నాలజీ, డిజిటల్ విద్య, ఆరోగ్య సాంకేతికత మరియు స్థిరమైన అధిక-ప్రభావ వ్యవస్థాపకత రంగాలలో భారతీయ నాయకులు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నారు. విజ్ఞానం, సాంకేతికత, సంప్రదాయం – ఈ మూడు అంశాలను సమన్వయం చేస్తూ భారత ఆవిష్కరణ దృశ్యం మరింత విస్తరిస్తోంది.

### స్వదేశీ బయోటెక్ విప్లవం

– సీఎస్ఐఆర్ - ఐజీఐబి పరిశోధకులు

సికిల్ సెల్ వ్యాధికి భారతదేశపు మొట్టమొదటి స్వదేశీ సిఆర్ఐపీసీఆర్ ఆధారిత చికిత్స అయిన "బిర్సా 101" అభివృద్ధి చేయడం ద్వారా సీఎస్ఐఆర్ - ఐజీఐబి పరిశోధకులు వైద్య రంగంలో చరిత్ర సృష్టించారు. ఇది కేవలం వైద్య విజయం మాత్రమే కాదు; సమాన ఆరోగ్య సంరక్షణకు నూతన దారిని చూపించే సామాజిక ఆవిష్కరణ కూడా. తక్కువ ఖర్చుతో అధిక ప్రభావం చూపే ఈ చికిత్స లక్షలాది మంది రోగులకు ఆశాకిరణంగా మారింది.

### ఇన్ఫీహీల్ హెల్త్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్

– ఏఐతో ఆరోగ్య సేవలకు నూతన రూపం

ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ఏఐ ఆధారిత ఆరోగ్య పరిష్కారాలకు గుర్తింపు పొందిన ఇన్ఫీహీల్ హెల్త్‌టెక్, ప్రాథమిక నిర్ధారణల నుంచి వ్యక్తిగత వైద్య సూచనల వరకు స్మార్ట్ ప్లాట్‌ఫామ్‌లను అభివృద్ధి చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ డిజిటల్ ఆరోగ్య సేవలు అందించాలన్న లక్ష్యంతో, డేటా విశ్లేషణ, మెషీన్ లెర్నింగ్ ఆధారిత టూల్స్‌ను వైద్యులకు అందిస్తోంది. "ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఆరోగ్యం" అన్న దృక్పథంతో ముందుకు సాగుతోంది.

### ఎలిక్సియర్ వ్యవస్థాపకులు – వేగం కంటే అనుభవమే ప్రాధాన్యం

యూత్ ఇన్కార్పొరేటెడ్ మ్యాగజైన్ నివేదికల ప్రకారం, ఎలిక్సియర్ వ్యవస్థాపకులు "త్వరిత వాణిజ్యం"ను పునర్నిర్వచిస్తున్నారు. కేవలం వేగవంతమైన డెలివరీ కాకుండా వినియోగదారునికి ప్రత్యేక అనుభవం అందించడం, డేటా ఆధారిత వ్యక్తిగత సిఫార్సులు, ఆఫ్‌లైన్–ఆన్‌లైన్ సమన్వయం—ఇవి వారి వ్యూహంలో ప్రధానాంశాలు. వినియోగదారుడి భావోద్వేగ అనుభవమే భవిష్యత్ రిటైల్‌కు మార్గదర్శకం అని వారు చెబుతున్నారు.

### డాక్టర్ హుజైఫా ఖోరకివాలా – బయోటెక్‌లో సంచలన ఆవిష్కరణలు

ఇండియా ఫార్మా ఔట్‌లుక్ పేర్కొన్నట్లు డాక్టర్ హుజైఫా ఖోరకివాలా యాంటీబయాటిక్స్ వంటి క్లిష్ట రంగాల్లో కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌కు వ్యతిరేకంగా సమర్థవంతమైన ఔషధాలు, స్థిరమైన ఆరోగ్య సంరక్షణ విధానాలు—ఇవి ఆయన దృష్టి కేంద్రము. బయోటెక్ పరిశోధనలో భారతీయ ఔషధ రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు.

### కిరణ్ జోషి – విద్యను అనుభవంగా మలిచిన మార్గదర్శి

మార్క్ గురు ద్వారా కిరణ్ జోషి విద్యను కేవలం పరీక్షలకే పరిమితం కాకుండా విద్యార్థి కేంద్రీకృత ప్రయాణంగా మార్చుతున్నారు. వ్యక్తిగత అభ్యాస పథకాలు, నైపుణ్యాధారిత మదింపు విధానాలు, మెంటార్‌షిప్ మోడల్—ఇవి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందిస్తున్నాయి. "అర్థవంతమైన విద్యే నిజమైన విజయం" అన్న సందేశంతో ఆయన ముందుకు సాగుతున్నారు.

### రాజేంద్ర బంధు – సమాజ మార్పుకు కమ్యూనిటీ శక్తి

యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా నివేదికల ప్రకారం, ఇండోర్‌లో కమ్యూనిటీ-కేంద్రీకృత సామాజిక పరివర్తనకు రాజేంద్ర బంధు చోదక శక్తిగా నిలుస్తున్నారు. స్థానిక యువత, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి సామాజిక సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలు అందిస్తున్నారు. "సమాజమే మార్పుకు మూలం" అన్న భావనను కార్యరూపంలో చూపిస్తున్నారు.

### డిజిటల్ లెర్నింగ్‌కు దిశానిర్దేశం

– డా. ఎస్. ద్వారకీష్

డిజిటల్ విద్యా విప్లవానికి మార్గదర్శిగా నిలిచిన డా. ఎస్. ద్వారకీష్, విద్యలో సాంకేతికతను సమర్థంగా మిళితం చేస్తూ సమగ్ర డిజిటల్ లెర్నింగ్ ఎకోసిస్టమ్‌ను నిర్మించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి అంతర్జాతీయ వేదికల వరకు విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించడమే ఆయన లక్ష్యం. నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, పరిశ్రమ అవసరాల మధ్య సమన్వయం కల్పించే విధానంతో ఎడ్యుటెక్ రంగంలో ఆయన విశేష గుర్తింపు పొందారు.

### ఆచరణాత్మక ఏఐకి రూపకర్త

– డా. పూంగోడి మనోహరన్

ఏఐ రంగంలో భారతీయ ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పిన డా. పూంగోడి మనోహరన్, మునిస్ ఏఐ ద్వారా వ్యాపార వృద్ధికి ఉపయోగపడే ఆచరణాత్మక ఏఐ పరిష్కారాలను అందిస్తున్నారు. చిన్న మరియు మధ్య తరహా సంస్థలకు ఏఐ ఆధారిత డేటా విశ్లేషణ, ఆటోమేషన్, వ్యూహాత్మక నిర్ణయాలపై దృష్టి సారించడం ఆమె ప్రత్యేకత. "ఏఐ అనేది భవిష్యత్తు కాదు, వర్తమానం" అన్న భావనను కార్యరూపంలో చూపించిన నాయకురాలు ఆమె.

### టెక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో నూతన మార్గాలు

– లక్ష్య్ జైన్

బ్యాక్‌ఎండ్ టెక్నాలజీ మరియు అధిక ప్రభావ సాంకేతిక వ్యవస్థల నిర్మాణంలో లక్ష్య్ జైన్ సీరియల్ వ్యవస్థాపకుడిగా ప్రసిద్ధి పొందారు. డేటా సెంటర్లు, క్లౌడ్ మౌలిక సదుపాయాలు, స్కేలబుల్ సాఫ్ట్‌వేర్ నిర్మాణాలు – ఇవన్నీ భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు బలమైన వెన్నెముకగా నిలుస్తున్నాయి. "దృశ్యములో కనిపించని సాంకేతికతే నిజమైన బలం" అనే సిద్ధాంతంతో ఆయన ముందుకు సాగుతున్నారు.

### సంప్రదాయం– సాంకేతికత సమ్మేళనం

– డా. జితేంద్ర పట్వారీ

సమగ్ర వెల్నెస్ రంగంలో డా. జితేంద్ర పట్వారీ వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. ఆయుర్వేదం, యోగా వంటి పురాతన జ్ఞానాన్ని ఆధునిక డిజిటల్ ఆరోగ్య సాంకేతికతతో అనుసంధానిస్తూ వ్యక్తిగత ఆరోగ్య నిర్వహణకు స్మార్ట్ పరిష్కారాలు అందిస్తున్నారు. ఆరోగ్య సంరక్షణను నగరాలకు మాత్రమే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడమే ఆయన దృష్టి.

# అందరి సహకారంతో ఆదిలాబాద్ మున్సిపల్ పీఠం

## కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** భూకబ్జాకోరు ఎమ్మెల్యే పాయల్ శంకర్ కబంధ హస్తాల నుండి మున్సిపల్ ను, పట్టణ ప్రజలను కాపాడేందుకు మున్సిపల్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్టించిందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.మత విద్వేషాలతో రెచ్చగొట్టి ప్రజలను భయాందోళనలకు గురిచేసే పార్టీకి మున్సిపల్ పీఠం దక్కకూడదనే సెక్యులర్ పార్టీలు , ఇండిపెండెట్ల మద్దతు కూడగట్టామన్నారు.వారి సహకారంతో మున్సిపల్ చైర్ పర్సన్ గా బండారి అనూష సతీష్ ను ఎన్నుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇందుకు సహకరించిన బీఆర్ఎస్, బీజేపీ స్వతంత్ర కౌన్సిలర్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.అలాగే ఓట్లేసి తమ పార్టీ కౌన్సిలర్లను గెలిపించిన బల్దియా ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.రౌడీషీటర్ల అండతో అధికారులను ప్రజలను బెదిరించి భూములు లాక్కునే పాయల్ గ్యాంగ్ దుర్మార్గ సంస్కృతికి చరమగీతం పలుకుతామన్నారు.ఆదిలాబాద్ నుండి తరిమికొట్టేరోజు త్వరలో వస్తుందన్నారు. నూతనంగా ఎన్నికైన చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ పై తనకు పూర్తి విశ్వాసముందన్నారు.ఆదిలాబాద్ ను క్లీన్ అండ్ గ్రీన్ టౌన్ గా అభివృద్ధి చేస్తుందని దోమలు లేని పట్టణంగా తీర్చిదిద్దుతుందన్నారు.తనకు ఆడబిడ్డలు లేరని అనూషను స్వంత చెల్లిగా భావిస్తున్నానని ఆమె ఎన్నికవడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.ప్రజల ఆశీర్వాదంతో అత్యధిక ఓట్లు పొందినట్టు తెలిపారు. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలోనూ కాంగ్రెస్ ఓట్ షేర్ గణనీయంగా పెరిగిందన్నారు.రానున్న అసెంబ్లీ ఎన్నికల సమయానికల్లా కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఇంకా బలమైన శక్తిగా ఎదుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులను కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు.పార్టీ కోసం కష్టపడే ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. మళ్లీ మరోమారు రాష్ట్రంలో రేవంత్ రెడ్డిని సీయం చేయడం అటు కేంద్రంలో రాహుల్ గాంధీని పీయంగా చూడడం తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష,ఆత్మ కమిటీ చైర్మన్ సంతోష్ రావు,డీసీసీబీ మాజీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి, కౌన్సిలర్ మంగేష్,శాంతన్ రావు, రాందాస్ నాక్లే, సుధాకర్ గౌడ్, భూపల్లి శ్రీధర్ , శ్రీలేఖ, రఫీక్, బండారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మ కమిటీ చైర్మన్ గా సంతోష్ రావు బాధ్యతల స్వీకరణ



**ఆదిలాబాద్ మహా :** పార్టీలో కష్టపడి పని చేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందని పదవులు వాటంతటవే వస్తాయని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు.శుక్రవారం మావల రైతువేదికలో జరిగిన ఆత్మకమిటీ చైర్మన్ సంతోష్ రావు ప్రమాణ స్వీకారం పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. సంతోష్ రావు పనిపట్ల నిబద్ధత కలిగిన నాయకుడని రైతుల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేసేలా పని చేస్తాడని ఆయన ఆకాంక్షించారు.అటు తనపై నమ్మకంతో చైర్మన్ పదవి వచ్చేలా చేసిన కంది శ్రీనివాస రెడ్డికి సంతోష్ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతతో పని చేస్తానన్నారు. బోథ్ అసెంబ్లీ ఇంచార్జి ఆడె గజేందర్ సంతోష్ కు చైర్మన్ పదవి దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేసారు. అనంతరం పలువురు పార్టీ నాయకులు సంతోష్ రావుకు అభినందనలు తెలిపి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి, సతీష్,మాజీ మున్సిపల్ చైర్మన్ దిగంబర్ రావు పాటిల్, మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.




# సెక్యూరిటీ టెండర్లలో అక్రమాల ఉల్లంఘనలు

## మందమర్రి సిపిఐ పట్టణ కార్యదర్శి కామెరా దుర్గ రాజ్

**మందమర్రి, మహా :** ఇటీవల మందమర్రి ఏరియాలో 90 మంది అవుట్ సోర్సింగ్ సెక్యూరిటీ గార్డుల కేటాయింపు కోసం నిర్వహించిన టెండర్లలో భారీ అక్రమాలు సిపిఐ పట్టణ కార్యదర్శి కామెరా దుర్గ రాజ్ ఆరోపించారు. శుక్రవారం ఆయన పాత్రికేయులకు ఒక సుదీర్ఘ ప్రకటనను విడుదల చేశారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి అర్హత లేని సంస్థలకు సింగరేణి యాజమాన్యం టెండర్లు కట్టబెట్టేందుకు ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. మాధవ్ సెక్యూరిటీ సర్వీస్, తిరంగ సెక్యూరిటీ అండ్ అవుట్ సోర్సింగ్ సర్వీసెస్ సంస్థలకు సరైన ధృవీకరణ పత్రాలు లేవని పేర్కొన్నారు. అధికార పార్టీకి చెందిన మంత్రులు, నేతల అండతో అధికారులపై ఒత్తిడి తెచ్చి ఫైళ్లను వేగంగా కదిలిస్తున్నారని ఆరోపించారు. ఎల్ 1 కాంట్రాక్టర్ టెండర్ డ్రా పద్ధతిలో ఎంపికైన తర్వాత హోమ్ డిపార్ట్మెంట్ కు చెందిన (పసరా) లైసెన్స్ ను ఒక్క రోజులోనే సృష్టించి సమర్పించారని దుర్గ రాజ్ వెల్లడించారు. అందులో వర్క్ ఆర్డర్ తేదీలు, జీఎస్టి వివరాలు పొంతన లేకుండా ఉన్నాయని, ఈఎస్ఐ, పిఎఫ్ బిల్లులు, బ్యాంక్ స్టేట్ మెంట్ లను నిశితంగా పరిశీలించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎల్ 2 కాంట్రాక్టర్ కు సంబంధించి ఫైనాన్షియల్ ఇయర్ లో ఒక నెల తక్కువగా ఉందని, పసరా లైసెన్స్ వచ్చి రెండు నెలలు కూడా కాకముందే ఏడాది అనుభవం ఉన్నట్లు పత్రాలు ఎలా సమర్పిస్తారని ప్రశ్నించారు. ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ రెగ్యులేషన్ యాక్ట్ 2005 ప్రకారం లైసెన్స్ రాకముందు చేసిన పని అనుభవంగా చెల్లదని స్పష్టం చేశారు. కొన్ని సంస్థల వద్ద పని చేయకపోయినా చేసినట్లుగా తప్పుడు పత్రాలు సృష్టించారని ఆరోపించారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన కోరారు. పూర్తిస్థాయి డాక్యుమెంట్లు ఉన్న వారికే టెండర్ కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సంబంధిత ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంలో మందమర్రి జనరల్ మేనేజర్ తక్షణమే స్పందించి నిజా నిజాలను గ్రహించాలని దుర్గ రాజ్ వేడుకున్నారు.



### సర్వే పనులను పారదర్శకంగా

# నిర్వహించాలి

## మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య

**మంచిర్యాల, మహా :** ప్రభుత్వం నిర్దేశించిన సర్వే పనులను ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా భూ కొలతల అధికారి శ్రీనివాస్ తో కలిసి లైసెన్స్ సర్వేయర్ శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన సర్వే పనులను లైసెన్సుడ్ సర్వేయర్లు ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా పారదర్శకంగా నిర్వహించాలని, జిల్లాలో భూ సమస్యల పరిష్కారానికి సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా లైసెన్స్ సర్వేయర్ శిక్షణ పొంది ఉత్తీర్ణులైన 99 మంది లైసెన్సుడ్ సర్వేయర్లకు లైసెన్స్ ధ్రువీకరణ పత్రాలు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి, సర్వే సిబ్బంది, లైసెన్సుడ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణ కొరకు చర్యలు చేపడుతుంది

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల, మహా : ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణ కొరకు చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం లక్సెట్టిపేట 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, ల్యాబ్, రిజిస్టర్లు, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమించి మందులను అందుబాటులో ఉంచి ప్రజల సంక్షేమం కొరకు తగు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో వైద్యులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రి పరిధిలో కొనసాగుతున్న మార్చురీ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపనకు హాజరైన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** ఎప్పుడు ఏ అవసరమొచ్చినా ప్రజలకు తాను అందుబాటులో ఉంటానని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం జైనథ్ మండలం ఆనంద్ పూర్ గ్రామంలో జరిగిన హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. శాలువాలతో సత్కరించారు.ఆలయంలో కంది శ్రీనివాస రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ సంతోష్ రావు, డీసీసీబీ మాజీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి , శాంతన్ రావు, గడ్డం జగదీష్ రెడ్డి,ఆనంద్ పూర్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

- రూ.2 కోట్లతో పాఠశాల భవన నిర్మాణం
- అధికారులతో కలిసి స్థల పరిశీలన చేసిన పరమేశ్వర్ రెడ్డి



**కుషాయిగూడ, మహా :** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనతో పాటు మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఉప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.2 కోట్ల నిధులతో నిర్మించనున్న కొత్త భవనాల స్థలాన్ని పరమేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ రజితా పరమేశ్వర్ రెడ్డి, మండల విద్యాధికారి రామారావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అవసరమైన్ని నిధులను ప్రభుత్వం విడుదల చేస్తోందన్నారు. విద్యార్థులకు మెరుగైన తరగతి గదులు, ప్రయోగశాలలు, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఇదే విధంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రామారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శిరీష, ఉపాధ్యాయులు అశోక్ తదితరులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ హనుమంతరావు



**యాదగిరిగుట్ట, మహా:** ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం యాదగిరిగుట్ట ప్రాథమిక వైద్యశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ...ఆసుపత్రిలో డాక్టర్ , మెడికల్ సిబ్బంది అందరూ వచ్చారా లేదా అని హాజరు రిజిస్టర్ పరిశీలించారు.సిబ్బంది అందరూ సమయపాలన పాటించి రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ఈరోజు ఓ.పి కి ఎంత మంది వచ్చారని ఆరా తీసి వారు ఏ సమస్యతో వచ్చారని అడిగి తెలుసుకున్నారు. వచ్చిన పేషంట్లలో ఎక్కువగా ఏ సమస్య పై వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అవసరైన మందులు అన్ని సరిపోను అందుబాటులో ఉన్నాయ అని అడిగి, అన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. గత నెలలో ఆసుపత్రిలో ఎన్ని డెలివరీలు జరిగాయని, అందులో సాధారణ ప్రసవాలు ఎన్ని అయ్యాయని ఆరా తీశారు.ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల టెస్టులు చేస్తున్నారని గర్భిణీలకు అవగాహన కల్పించి ప్రభుత్వ ఆసుపత్రిలోనే డెలివరీలు చేయించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు.ఆసుపత్రిలో ఇటీవల నార్మల్ డెలివరీ జరిగిన గర్భిణి స్త్రీ కి కలెక్టర్ స్వయంగా ఫోన్ చేసి పుట్టిన బిడ్డ ఆరోగ్యం ఎలా ఉంది ,ఎంత బరువులో పుట్టారు, ఆసుపత్రి లో డాక్టర్ మరియు సిబ్బంది వైద్య చికిత్సలు అన్ని మంచిగా చేసారా అని అడిగి తెలుసుకున్నారు.అప్పుడు గర్భిణీ ప్రభుత్వ ఆసుపత్రిలో మంచి వైద్య సేవలు అందిస్తున్నారని , ఎలాంటి ఇబ్బందులు కూడా లేవని తెలిపారు.

### విద్యార్థుల ఆధార్ నెంబర్ ను

# బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేయాలి

## మంచిర్యాల జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ పథకం కింద విద్యార్థుల బ్యాంకు ఖాతాల ఆధార్ సీడింగ్, డి బి టి యాక్టివేషన్ త్వరితగతిన చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ లు తమ కళాశాలల విద్యార్థుల బ్యాంకు ఖాతాలను ఆధార్ తో అనుసంధానం చేయాలని, సంబంధిత బ్యాంక్/ www npci.org.in ద్వారా డి బి టి కోసం ఫ్లాగ్ చేయడం తప్పనిసరి అని పేర్కొన్నారు.జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ, పి జి, ఇంజనీరింగ్ (ప్రొఫెషనల్, నాన్ ప్రొఫెషనల్) ఇతర కళాశాలల ప్రిన్సిపాళ్ళు తమ కళాశాలలోని బిసి, ఈ బి సి విద్యార్థులకు డి బి పి యాక్టివేషన్ కొరకు ఆధార్ నంబర్ ను వారి బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేయాలని చెప్పారు. తమ కళాశాలల నోటీస్ బోర్డ్ లో దశలవారీగా మార్గదర్శకాలు ప్రదర్శించడం ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని, 2025 26 విద్యా సంవత్సరానికి సి ఎస్ ఎస్ బడ్జెట్ క్రింద బి సి, ఈ బి సి పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ మంజూరు, పంపిణీకి ఈ చర్య అత్యవసరమని తెలిపారు.

### యూరియా యాప్ ను

# రద్దు చేయాలి

## సంగిశెట్టి క్రిస్టఫర్, సామాజిక కార్యకర్త



**వలిగొండ, మహా :** యూరియా యాప్ తో అనేకమంది గ్రామీణ రైతులు అనేక ఇబ్బందులు పడవలసి వస్తుందని సామాజిక కార్యకర్త సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు గ్రామాలలో చదువురాని గ్రామీణ రైతులు మహిళా రైతులు యూరియా యాప్ తో అవస్థలు పడుతూ యూరియా దొరకక నానా తంతాలు పడుతున్నారని అన్నారుప్రభుత్వం యూరియా యాప్ ను రద్దుచేసి రైతులకు అందుబాటులో ఉండే విధంగా యూరియాను నిల్వ ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు.

# కార్వంగ గ్రామంలో సీసీ రోడ్ల శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**నాగర్ కర్నూల్ జిల్లా మహా :** ఎమ్మెల్యే రాజేష్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్వంగ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం ద్వారా ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సదుపాయం కలుగుతుందని అన్నారు.అనంతరం పులిజాల నుండి కార్వంగ గ్రామం మధ్య ఉన్న వాగు కారణంగా రైతులు మరియు గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించిన ఎమ్మెల్యే త్వరలోనే ఆ వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**నాగర్ కర్నూల్ పట్టణ అభివృద్ధికి మరో అడుగు...**

ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే. నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలో 20 వా వార్డ్ లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కొత్తగా నిర్మించిన ఇళ్లను పరిశీలించి, లబ్ధిదారులు (మన్నెనమ్మ) తో ముచ్చటించారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు గృహ సౌకర్యం కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి కుటుంబం సొంత ఇంట్లో సంతోషంగా జీవించాలని ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఇల్లు అనేది కేవలం నివాస స్థలం మాత్రమే కాకుండా కుటుంబ అభివృద్ధికి పునాది అని ఆయన పేర్కొన్నారు. నాగర్ కర్నూల్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెల్కపల్లి మండలానికి సంబందించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను సంబందించిన లబ్ధిదారులకు పంపిణీ చేసిన మన ప్రియతమ నేత ఎమ్మెల్యే Dr. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి.

# రోడ్డు ప్రమాదాలను నివారించాలి



## జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**యాదాద్రి భువనగిరి, మహా :** రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించి ప్రజల ప్రాణాలను కాపడడం కోసం జిల్లాలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం రోజు కలెక్టరేట్ మినీ మీటింగ్ హాలులో జిల్లాలో రోడ్డు భద్రతా పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ మధ్యకాలంలో జిల్లాలో జరిగిన ప్రమాదాలకు గల కారణాలు అడిగి తెలుసుకుని వాటిని గుర్తించి ఆ ప్రదేశాల్లో మళ్లీ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సాధించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రధాన రహదారులపై స్పీడ్ గన్స్ ఏర్పాటు చేసి, స్పీడ్ లిమిట్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో మైనర్ బాలుర డ్రైవింగ్ ని కట్టడి చేసి డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేయాలని తెలిపారు. జిల్లాలో ఉన్న పాఠశాల బస్సులు అన్ని కండిషన్లు ఉన్నాయా లేవా అని చెక్ చేసి లేని వాటిని చేయాలని సూచించారు.యాక్సిడెంట్ రోడ్డు ప్రమాదాల నివారణకు మరిన్ని పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గత సమావేశంలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టారు, జిల్లాలో ఎన్ని బ్లాక్ స్పాట్స్ ఉన్నాయి వాటి పై తీసుకున్న చర్యలు ఏమిటని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రమాద ప్రదేశాలలో సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నేషనల్ హైవే అథారిటీ, పంచాయతీ రాజ్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రోడ్ సేఫ్టీ సమావేశాల్లో చర్చించిన అంశాలకు సంబంధించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ...జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి తగు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.అతివేగంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు, స్పీడ్ గన్స్ తో తనిఖీలు మద్యం సేవించి వాహనం నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేసి కేసులు నమోదు చేయడం జరుగుతుందని,హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరి ఉల్లంఘనలకు జరిమానాలు విధించి , బ్లాక్ స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశామన్నారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ,ట్రాఫిక్ ఏసిపి ప్రభాకర్ రెడ్డి, రోడ్డు భవనాల శాఖ అధికారి సరిత,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నాగారంలో పోకిరీల ఆగడాలు

- మోటార్ సైకిళ్లతో సర్కస్ ఫీట్లు
- మాజీ ఎంపీపీకి గాయాలు

**కుషాయిగూడ, మహా :** కీసర మండలంలోని నాగారంలో పోకిరీల ఆగడాలు మళ్లీ వెలుగుచూశాయి. మైనర్లు మోటార్ సైకిళ్లపై అతి వేగంతో సర్కస్ ఫీట్లు వేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు. ఈ క్రమంలో కీసర మాజీ ఎంపీపీ ముప్పు రామిరెడ్డిని మోటార్ సైకిల్ తో ఢీకొట్టారు. ఈ ఘటనలో రామిరెడ్డికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు. ఘటన అనంతరం ముగ్గురు పోకిరీలలో ఇద్దరు పరారయ్యారు. ఒకరిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సమాచారం అందుకున్న కీసర పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పట్టుబడిన యువకుడిని కీసర పోలీస్ స్టేషన్కు తరలించారు. కుషాయిగూడలో జరిగిన ఇటీవలి ఘటన మరవకముందే కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో నాగారంలో మళ్లీ ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం స్థానికుల్లో ఆగ్రహం రేపుతోంది. మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పోకిరీలపై కఠిన చర్యలు తీసుకుని ప్రాంతంలో శాంతిభద్రతలు కాపాడాలని స్థానికులు పోలీసులను కోరుతున్నారు.

# నారాయణ 'నరక'శాల..

## చదువుల కోటలో మత్తు నిషా.. విచక్షణ కోల్పోయిన విద్యార్థులు!

**ఖమ్మం "మహా "ప్రతినిధి:**

లక్షల్లో ఫీజులు.. కార్పొరేట్ హంగులు.. ర్యాంకుల వేటలో మేమే నంబర్ వన్ అంటూ గొప్పలు చెప్పుకునే నారాయణ జూనియర్ కళాశాల అసలు స్వరూపం బయటపడింది. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన విద్యాసంస్థ, రౌడీలను తయారు చేసే కర్మాగారంగా మారుతోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాక్షాత్తు జిల్లా కేంద్రమైన ఖమ్మంలో, నారాయణ హాస్టల్ వేదికగా జరిగిన గంజాయి, మద్యం భీభత్సం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా కలకలం రేపుతోంది.

**మత్తులో చిత్తైన విద్యార్థులు.. రక్తం చిందిన హాస్టల్ గదులు**

చదువుకోవడానికి పంపిన పిల్లలు, మద్యం మరియు గంజాయి మత్తులో ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటుంటే కళాశాల యాజమాన్యం ఏం చేస్తోంది? ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులు గంజాయి మత్తులో విచక్షణ కోల్పోయి, సహచర విద్యార్థి మామిడాల విశాల్ పై పిడిగుద్దుల వర్షం కురిపించారు. విచక్షణారహితంగా సాగిన ఈ దాడిలో విశాల్ తీవ్రంగా గాయపడి, గత రెండు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అడ్డుకోబోయిన ఇతర విద్యార్థులను కూడా వదలకుండా దాడికి దిగడం చూస్తుంటే, అక్కడ అసలు క్రమశిక్షణ అనేది ఉందా? లేక అది ఒక అసాంఘిక కార్యకలాపాల నిలయమా? అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

**భద్రత సున్నా.. వసూళ్లు మిన్న!**

ఒక్కో విద్యార్థి వద్ద నుంచి రూ. 1.5 లక్షల నుండి రూ. 2 లక్షల వరకు భారీ ఫీజులు వసూలు చేస్తున్న నారాయణ యాజమాన్యం, కనీస భద్రతను కూడా కల్పించలేకపోతోంది. ఘటన జరిగిన సమయంలో హాస్టల్ లో వార్డెన్ లేడు. గేటు వద్ద కనీసం సెక్యూరిటీ గార్డు జాడ లేదు. విద్యార్థులు లోపలికి మద్యం, గంజాయి ఎలా తెస్తున్నారో పర్యవేక్షించే నాథుడే లేడు. ఇంత భారీ మొత్తంలో ఫీజులు కడుతున్న తల్లిదండ్రులకు, తమ పిల్లల ప్రాణాలకు గ్యారెంటీ లేకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. తమ పిల్లలను రౌడీలుగా తయారు చేసి బయటకు పంపుతున్నారా? అని తల్లిదండ్రులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు.

**"ఇది కామనే.." - యాజమాన్యం నిర్లక్ష్యం పరాకాష్ట**

ఈ ఘటనపై యాజమాన్యాన్ని ప్రశ్నించిన బాధితుడి తల్లిదండ్రులకు ఎదురైన సమాధానం అవాక్కయ్యేలా చేసింది. "ఇలాంటివి కాలేజీల్లో కామన్.. మీరు మీరు చూసుకోండి, మాకు సంబంధం లేదు" అంటూ అత్యంత బాధ్యతారాహిత్యంగా సమాధానం ఇచ్చారు. ఒక విద్యార్థి ఆసుపత్రి పాలైతే, కనీస మానవత్వం లేకుండా మాట్లాడటం నారాయణ యాజమాన్య అహంకారానికి నిదర్శనం.

**మీడియాపై బెదిరింపులు.. తల్లిదండ్రులపై బ్లాక్ మెయిల్**

ఈ విషయం బయటకు పొక్కడంతో వివరణ కోరడానికి వెళ్లిన మీడియా ప్రతినిధులను కూడా యాజమాన్యం తక్కువ చేసి మాట్లాడింది. "మేము ప్రతి ఛానల్ కు కోట్లలో అడ్వర్టైజ్మెంట్లు ఇస్తాం.. మాపై వార్తలు రావు" అంటూ తమకున్న ఆర్థిక బలంతో నోళ్లు నొక్కే ప్రయత్నం చేశారు. అంతేకాకుండా, తమ పాపాలను దాచుకోవడానికి బాధితుడి తల్లిదండ్రులనే భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ విషయంపై బయట ఎక్కడా ఫిర్యాదు చేయవద్దని, అలా చేస్తే ఈ నెల 26న జరగబోయే పరీక్షలకు విద్యార్థికి హాల్ టికెట్ ఇవ్వబోమని బెదిరించడం వారి నీచ విధానాలకు పరాకాష్ట.

# సోషల్ మీడియా బలోపేతంతోనే..
# ప్రజలకు నిజమైన సమాచారం..

**యువత ముందుండాలని ఎమ్మెల్యే పాయం పిలుపు**



**మణుగూరు, మహా :** మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం (ప్రజాభవన్)లో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సోషల్ మీడియా రివ్యూ సమావేశానికి పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సోషల్ మీడియా, యువజన కాంగ్రెస్ ముఖ్య నాయకులతో జరిగిన ఈ ఆత్మీయ సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. పార్టీ విధివిధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, యువతను చైతన్యపరచడం, ప్రజా సమస్యలపై సమయానుకూలంగా స్పందించడం వంటి అంశాల్లో యువజన శ్రేణులు చురుకుగా వ్యవహరించాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి యువత ముందుండాలని, సోషల్ మీడియా వేదికలను సమర్థంగా వినియోగిస్తూ ప్రజలకు నిజమైన సమాచారం చేరవేయాలని పిలుపునిచ్చారు. అపోహలు, తప్పుడు ప్రచారాలను ఖండిస్తూ సత్యాన్ని ప్రజలకు తెలియజేయడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన అన్నారు. అనంతరం సోషల్ మీడియా సభ్యులు ఎమ్మెల్యే పాయంను శాలువాలతో, పార్టీ కండువాళ్ళతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గుండా రాహుల్, సోషల్ మీడియా కన్వీనర్ బండారు నవీన్, మణుగూరు మండల యువజన నాయకులు చింతకుంట్ల రాకేష్, జూపల్లి వినయ్, జిల్లా యువజన ప్రతినిధి మేకల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# రవాణా సౌకర్యం లేని గ్రామలలో ఏఎన్ఎం అందించిన సేవలు మరువలేనివి

**జిల్లా వైద్యాధికారి డా.తుకారం రాథోడ్.**



**మహా దుమ్ముగూడెం:** ఏజెన్సీలోని మారుమూల గిరిజన గ్రామాల్లో ప్రజల వైద్యం కోసం ఏఎన్ఎం ధనలక్ష్మి 36 సంవత్సరాలుగా అందించిన వైద్య సేవలు మరువలేనివని భద్రాది కొత్తగూడెం జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారం రాథోడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విశిష్ట సేవలు అందించి ఈనెల 31న పదవి విరమణ పొందుతున్న సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ.. ఏఎన్ఎం ధనలక్ష్మి తన వైద్య వృత్తిలో మారుమూల గ్రామాల ప్రజల శ్రేయస్సు కోసం కృషి చేశారని రవాణా సాంకేతిక సరైన సౌకర్యాలు లేని ఆ రోజుల నుండి దూర ప్రాంతాలకు వెళ్తూ నిబద్ధత వైద్య సేవలు అందించాలని కొనియాడారు. ఉద్యోగ బాధ్యతల నుండి పదవి విరమణ పొందుతున్న ధనలక్ష్మి కి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, బంధుమిత్రులు, ఆప్తులు, హాజరై వారి యొక్క జ్ఞాపకాలను అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు వైద్యాధికారి సైదులు డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీధర్ ఆరోగ్య కేంద్రం డి డి ఓ డాక్టర్ చైతన్య డాక్టర్ సుభాష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకం

**ఎంపీడీవో వివేక్ రామ్**



**మహా దుమ్ముగూడెం :** గ్రామాల అభివృద్ధిలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల పాత్ర కీలకంగా ఉండాలని దుమ్ముగూడెం ఎంపీడీవో వివేక్ రామ్ అన్నారు. దుమ్ముగూడెం మండలంలోని గ్రామపంచాయతీలలో వార్డు సభ్యులకు పెద్దనల్లబల్లి రైతు వేదిక వద్ద గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో వార్డు సభ్యులకు మాట్లాడుతూ..నిధుల వినియోగం, ప్రజా సమస్యల పరిష్కారం పారిశుధ్య చర్యలు సంక్షేమ పథకాల అమలు అంశాలపై సభ్యులకు వివరించినట్లు పేర్కొన్నారు. ప్రజలతో సమన్వయం పెంపొందించుకుని పారదర్శకంగా పని చేయాలని సభ్యులకు సూచించారు. అనతరం వార్డు సభ్యులకు శిక్షణ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి వీరారెడ్డి గ్రామపంచాయతీ సెక్రటరీలు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# వార్డు సభ్యులకు వ్యవసాయ పథకాలపై శిక్షణ..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని గుట్ట మల్లారం రైతు వేదికలో గ్రామపంచాయతీల వార్డు సభ్యులకు శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామ స్థాయిలో వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి లక్ష్మణ్ రావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ వ్యవసాయ పథకాల పనితీరు, రైతులకు అందుతున్న సబ్సిడీలు, పంట బీమా, ఎరువుల పంపిణీ తదితర అంశాలపై వార్డు సభ్యులకు వివరించారు. రైతుల సమస్యలను గుర్తించి వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. గ్రామాల్లో రైతు సమితుల సమన్వయంతో పథకాలు సక్రమంగా అమలవుతాయన్నారు. రైతులకు సరైన సాంకేతిక సూచనలు అందేలా కృషి చేయాలని, పంటల వైవిధ్యీకరణ, నీటి వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. వార్డు సభ్యులు ప్రభుత్వ పథకాల సమాచారాన్ని ప్రతి రైతు వరకు చేరవేయడంలో చురుకుగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వర్లు, గ్రామ వార్డు సభ్యులు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు

**తల్లాడ, మహా:** తల్లాడ మండలం అంజనాపురం గ్రామంలో చందా వెంకటేశ్వర్లు తనయుడు చందా సత్యనారాయణ చేత నిర్మించబడిన నూతన గృహం, గృహప్రవేశ కార్యక్రమం శుక్రవారం ఉదయం స్థానిక అంజనాపురం గ్రామంలో వారి నూతన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ గృహప్రవేశ మహోత్సవ కార్యక్రమంలో తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు పాల్గొని సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నూతన గృహంలో మీరు మీ కుటుంబ సభ్యులు సుఖ సంతోషాలతో జీవించాలని. ఎల్లప్పుడూ సమృద్ధి జీవం గడించాలని. అష్టైశర్యాలతో తులతూగాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించి వారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వీర మోహన్ రెడ్డి ,ఆ పార్టీ మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకటలాల్, అన్నారుగూడెం సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, అంజనాపురం గ్రామ ఉపసర్పంచ్ కేతినేని చలపతిరావు, నరసింహారావు,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్ విద్యార్థులకు పరిశుభ్రతపై సూచనలు..

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అశోక్‌నగర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని క్షయ నియంత్రణ కార్యక్రమ అధికారి డాక్టర్ పుల్లా రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ బాలుర వసతి గృహాన్ని సందర్శించిన ఆయన, పరిసరాల్లో పరిశుభ్రత లోపించిందని, నీటి నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే నీటి నిల్వలు తొలగించి దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దోమతెరలను వినియోగించాలని, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం వసతి గృహంలోని వంటగది, సామాగ్రి నిల్వ గదులను పరిశీలించి అవసరమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ఆశా కార్యకర్తల సర్వే వివరాలను పరిశీలించి, ప్రతి ఇంటిలో నీటి నిల్వలు లేకుండా చూడాలని, ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్, వైద్య సిబ్బంది జానకి, రాంప్రసాద్, కృష్ణ, సుమ, విజయ తదితరులు పాల్గొన్నారు.

# జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కు సిద్ధంగా ఉండాలి



**చర్ల, మహా:** త్వరలో రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కు బీ ఆర్ ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలి అని భద్రాచలం నియోజకవర్గం బీ ఆర్ ఎస్ సీనియర్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ లు బీ ఆర్ ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. చర్ల BRS పార్టీ కార్యాలయం లో ముఖ్య కార్యకర్తల సమావేశం మండల కన్వీనర్ దొడ్డి తాతారావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశానికి భద్రాచలం నియోజకవర్గం సీనియర్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ మానే రామకృష్ణ ముఖ్య అతిథిలు గా హాజరై మాట్లాడారు. ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి హామీలు విస్మరించిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మాయమాటలు చెప్పి ఆరు గ్యారెంటీల పేరుతో మోసం చేసి గద్దెనెక్కి రెండున్నర సంవత్సరాలు అవుతున్న ఈరోజుకి ఏ ఒక్క హామీ కూడా సరిగ్గా అమలు చేయలేదని అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా తెల్లం వెంకట్రావు ని గెలిపిస్తే అభివృద్ధి పేరుతో గెలిపించిన కార్యకర్తలను మోసం చేసి పార్టీ మారిన వెంకట్రావు భద్రాచలం నియోజకవర్గం లో ఏమీ అభివృద్ధి చేశారో చూపించాలని ఆయన అన్నారు. ఎమ్మెల్యే తెల్లం కుటుంబం అభివృద్ధి చెందింది తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని అన్నారు. ఈ సమావేశంలో లో బీ ఆర్ ఎస్ పార్టీ మండల కో కన్వీనర్ పవన్ కుమార్ ,పార్టీ సీనియర్ నాయకులు కాకి అనిల్ పంజా రాజు దినసరపు భాస్కర్ రెడ్డి గోరింట్ల వెంకటేశ్వరరావు తడికల బుల్లెబ్బాయి కారం కన్నారావు బొజ్జ బాచి నాగరాజు సంతపూరి సతీష్ అంబోజి సతీష్ కనుకు భద్రం వంకాయల కృష్ణపాగా రాంప్రసాద్ ఆర్ఎంపి రాజు గాదంశెట్టి కిషోర్ బట్ట కొమరయ్య గుమ్మల నరేంద్ర చిన్నుమల్ల వంశి పార్టీ సర్పంచులు వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# దొంగనోట్ల కలకలం పై కొనసాగుతున్న విచారణ

- చిట్టీ వ్యాపారి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు
- ఆధారాలు దొరక్కుండా జాగ్రత్త పడుతున్న చిట్టి వ్యాపారులు

**కారేపల్లి, మహా:** కారేపల్లిలో దొంగనోట్ల కలకలం పై నిఘా వర్గాల విచారణ కొనసాగుతోంది. వారం రోజుల క్రితం బ్యాంక్ అధికారులు గుర్తించిన దొంగ నోటు వ్యవహారం బయటికి రావడం అదికూడా ఓ ప్రైవేట్ చిట్టీ వ్యాపారి వద్ద నుంచి చలామణి అయిందనే ఆరోపణ పై విస్తృతంగా చర్చ జరగడంతో ఇంటిలిజెన్సీ తో పాటు కారేపల్లి పోలీసులు కూడా వివరాలు తెలుసుకునే పనులు చేపట్టారు. కారేపల్లి బీసీ కాలనీకి చెందిన ఓ చిట్టి వ్యాపారిని పోలీసులు స్టేషన్ కు పిలిపించి వివరాలను సేకరించే పనులను ముమ్మరం చేసినట్లు సమాచారం... కారేపల్లి కేంద్రంగా మండల వ్యాప్తంగా అనుమతులు లేకుండా చిట్టీలు, గిరి గిరి, ఫైనాన్స్, వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు వారి ఇళ్లల్లో పోలీసుల దాడులు కూడా జరగొచ్చని ప్రచారం జరగడంతో చిట్టీ వ్యాపారులంతా ఎటువంటి ఆధారాలు లభించకుండా జాగ్రత్త పడుతున్నారనే ఆరోపణలున్నాయి. బీసీ కాలనీకి చెందిన చిట్టీ వ్యాపారి వద్ద నుంచి గతంలో కూడా ఒకరిద్దరికీ దొంగనోట్లు వచ్చాయనే ప్రచారం కారేపల్లిలో ప్రచారం జరుగుతోంది. ఎవరికీ అనుమానం రాకుండా కట్టలో ఒక నోటు చొప్పున పెడుతూ ఎవరికీ అనుమానం రాకుండా అత్యంత రహస్యంగా ఈ దొంగ నోట్ల చలామణి జరుగుతుందనే చర్చ జరుగుతుంది. అనుమతులు లేకుండా భారీగా చిట్టీల వ్యాపారం చేయడంతో పాటు అక్రమ లావాదేవీలు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# గుడితండాలో ఘనంగా భోగ్ బండారో



**కారేపల్లి, మహా:** కారేపల్లి మండలం మాణిక్యారం (గుడితండా)లో సంత్ సేవాలాల్ మహారాజ్ గారి 287వ జయంతి ఉత్సవాల ఈ సందర్భంగా శుక్రవారం భోగ్ బండారో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తండా నాయకుడు. కారుభారీ భూక్యా హుస్సేన్ నాయక్, ధారావత్ రాములు నాయక్ ఆధ్వర్యంలో తండావాసులు సేవాలాల్ చిత్రపటానికి పూలమాలవేసి పూజలు జరిపారు. వండిన నైవేద్యాన్ని అగ్ని దేవునికి అర్పిస్తూ భోగి బండారు నిర్వహించారు. ఈ సందర్భంగా తండా పెద్ద భూక్య హుస్సేన్ మాట్లాడుతూ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని.,పడి పంటలు బాగా పండాలని దేవుని కోరుతూ ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు. ధారావత్ కిషన్. భూక్యా రంగారావు. తండా వాసులు ధారవత్ వికాస్, భూక్యా కిషన్, ధారావత్ వస్రం, భూక్యా సురేష్, ధారవత్ బాలు, శివ, లాలు, రవి, అజ్మీర్ నాగేష్, ధారవత్ మహేష్, రాజేష్.ట, భూక్యా తరుణ్, భూక్యా రమేష్, ఈశ్వర్.నరేష్, హరి, సందీప్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిజియోథెరపీ, రిహాబిలిటేషన్ శిబిరంను
# సద్వినియోగం చేసుకోండి

**గిరిజన నాయకుడు అజ్మీరా వీరన్న**



కారేపల్లి, మహా: మిషన్ వాక్ పౌండేషన్, మిషన్ వాక్ న్యూరో రిహాబ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 22న ఉచితంగా ఫిజియోథెరపీ, రిహాబిలిటేషన్ శిబిరం ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గిరిజన నాయకుడు అజ్మీర వీరన్న కోరారు. కారేపల్లి లో ఆయన మాట్లాడుతూ కారేపల్లి మండలం కొత్త తండాకు చెందిన డాక్టర్ బాధావత్ రవి మిషన్ వాక్ పౌండేషన్ లని ప్రముఖ న్యూరో రిహాబిలిటేషన్ నిపుణులుగా ప్రసిద్ధి చెందారన్నారు. డాక్టర్ బాధావత్ రవి ఆధ్వర్యంలో కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ ఉచిత శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డాక్టర్ రవి 15 సంవత్సరాల అనుభవం కలిగిన అనుభావం ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్ తో పాటు బెంగళూరు, పూణే ,జైపూర్ ,ఢిల్లీ, గురుగ్రామ్, ముంబై వంటి నగరాల్లో ఫిజియోథెరపీ సెంటర్లను నడుపుతున్న అనుభవం ఉందన్నారు..శారీరకంగా ఇబ్బందులు పడుతున్న వారి కోసం ఈ ఉచిత ఫిజియోథెరపీ శిబిరం ఏర్పాటుచేశారని తెలిపారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారు, హైదరాబాద్ వెళ్లలేక ఫిజియోథెరపీ చేయించలేకపోతున్నారని దీనిని దృష్టిలో పెట్టుకుని కారేపల్లి లో ఉచిత ఫిజియోథెరపీ, రిహాబిలిటేషన్ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొట్టమొదటిసారిగా రోబోతో రోగులకు చికిత్స నిర్వహించటం జరుగుతుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఇందిరమ్మ గృహ ప్రవేశ మహోత్సవం లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



**నేలకొండపల్లి, మహా:** మండల కేంద్రంలోని బుద్దారం గ్రామంలో నూతన గృహప్రవేశంలో పాల్గొన్న పాలేరు సేవాదళ్ కన్వీనర్ బచ్చల కూరి నాగరాజు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో ప్రతి పేదవాడి ఇంటికల నెరవేరుతుందని అన్నారు. పర్వతు కనకయ్య ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ, పాలేరు నియోజకవర్గ సేవాదళ్ కన్వీనర్ బచ్చలికూరి నాగరాజు, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు భూక్యా చిన్న నాయక్, నేలకొండపల్లి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యడవల్లి నాగరాజు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గట్టిగుండ్ల విజయ్,లంజపల్లి వీరబాబు తదితరులు పాల్గొన్నారు..

# అబ్బుర పరిచిన విద్యార్థుల విన్యాసం



**మహా దుమ్ముగూడెం:** మండల పరిధిలోని నారాయణరావుపేట ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం సాయంత్రం విద్యార్థులు జిమ్నాస్టిక్ విన్యాసం అబ్బుర పరిచింది. నారాయణరావు పేట పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు కుంజ వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రతిరోజు విద్యార్థులకు నిర్వహించే పోటీలో భాగంగా శుక్రవారం భారతదేశపు చెందిన ప్రముఖ ఆట అయినటువంటి మల్లఖంబ్ అనేది జిమ్నాస్టిక్స్ ఆటను పిల్లలు ఒకరిపై ఒకరు ఎక్కుతూ ప్రయత్నిస్తే సాధ్యం కానిది ఏది లేదంటూ విజయవంతం అయ్యారు. వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేష్ శిక్షణలో గతి కొద్ది రోజులుగా పిల్లలకు నేర్పిస్తున్నారు. ఈ అథ్లెటిజం వల్ల పిల్లలలో కాన్ఫిడెన్స్ మరోరకంగా యోగా గా ఉపయోగపడుతుందని ఇది అందరి కలయికతో కూడిన క్రీడా అని ఆయన అన్నారు.

# స్థానిక కాంట్రాక్టర్లకు ప్రాధాన్యం కల్పిస్తాం..

**బిటిపిఎస్ సమస్యలపై ఎమ్మెల్యే పాయం హామీ**



**మణుగూరు, మహా :** భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బిటిపిఎస్)లో పనిచేస్తున్న స్థానిక కాంట్రాక్టర్ల సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తానని పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. శుక్రవారం మణుగూరులో బిటిపిఎస్ లోకల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్లాంటు నిర్మాణ దశ నుంచే గత 12 ఏళ్లుగా స్థానిక కాంట్రాక్టర్లు శ్రమించి స్కిల్డ్, అన్‌స్కిల్డ్ పనులు నిర్వహిస్తూ స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తున్నారని తెలిపారు. అయితే ఇటీవలి కాలంలో స్థానికేతర (నాన్‌లోకల్) కాంట్రాక్టర్ల జోక్యం పెరగడంతో స్థానిక కాంట్రాక్టర్లు, కార్మికులు ఉపాధి కోల్పోయే పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. టెండర్లు, సబ్ కాంట్రాక్టుల్లో స్థానికులకు అన్యాయం జరుగుతోందని వారు పేర్కొన్నారు. లోకల్ కాంట్రాక్టర్ల సమస్యలు విన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పందిస్తూ.. స్థానికులకు న్యాయం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. బిటిపిఎస్‌లో స్కిల్డ్, అన్‌స్కిల్డ్ పనుల్లో స్థానిక కాంట్రాక్టర్లకే ప్రాధాన్యం ఇచ్చేలా సంబంధిత అధికారులతో తక్షణమే చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. స్థానిక యువత, కార్మికులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగనివ్వనని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిటిపిఎస్ లోకల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు యూనిఫార్మ్స్ పంపిణీ..

**రాష్ట్ర స్థాయి క్రీడా విజేత ఏమన్నాను సన్మానించిన జీఎం**



**మణుగూరు, మహా :** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మణుగూరు ఏరియా జీఎం కార్యాలయంలో విద్యార్థులకు ప్రోత్సాహన్నిచ్చే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ తన చాంబర్‌లో సింగరేణి పాఠశాల భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు గైడ్స్ యూనిఫార్మ్‌స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జీఎం దుర్గం రామచందర్ మాట్లాడుతూ, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయపాలన, సేవాభావం, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి భావాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడ కార్యక్రమాల్లోనూ సమానంగా రాణించాలని సూచించారు. ఇటువంటి కార్యక్రమాలు వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని పేర్కొన్నారు. అదేవిధంగా, సింగరేణి పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న వై యమునా ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి కుంఫూ అండ్ ఉషు ఛాంపియన్‌షిప్ పోటీల్లో తృతీయ బహుమతి సాధించడం పట్ల జీఎం ప్రత్యేకంగా అభినందించారు. ఆమె సాధన పాఠశాలకు, మణుగూరు ఏరియాకు గర్వకారణమని అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సంస్థ ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తుందని హామీ ఇచ్చారు. తన విజయానికి ఉపాధ్యాయుల ప్రోత్సాహం, తల్లిదండ్రుల సహకారం కారణమని వై యమునా ఈ సందర్భంగా తెలిపింది. ఆమె విజయాన్ని ఆదర్శంగా తీసుకుని ఇతర విద్యార్థులు కూడా కృషి చేసి ఉన్నత స్థాయికి చేరుకోవాలని జీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) అండ్ పాఠశాల కరస్పాండెంట్ సలగల రమేష్, ప్రధానోపాధ్యాయురాలు ఆర్ కళ్యాణి, గైడ్ టీచర్ సరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


# యూరియాను పాత పద్ధతిలోనే పంపిణీ చేయాలి

**వ్యవసాయ డైరెక్టర్ ను కోరిన టీజెఎస్ నాయకులు**



**నేలకొండపల్లి, మహా:** యూరియా పంపిణీ ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి ని టీజెఎస్ నాయకులు కోరారు. శుక్రవారం తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు, జిల్లా నాయకులు మాదాసు శ్రీనివాసరావు, బీ.రాజేందరా నాయక్ లు హైద్రాబాద్ లోని డైరెక్టర్ ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడారు... ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా పంపిణీ యాఫ్ వలన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. యాఫ్ ను తొలిగించి పాత పద్ధతిలో ఆధార్ కార్డు, పహాని ద్వారా యూరియా ను అందించాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాఫ్ విధానం ను ఎత్తివేయకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. తమ విన్నపం పై సంచాలకులు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

## పీవీ కాలనీ బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యేను ఆహ్వానించిన ఉత్సవ కమిటీ




**మణుగూరు, మహా :** మణుగూరు మండలంలోని సింగరేణి ఏరియా పీవీ కాలనీలో నిర్వహించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలకు పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లును ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, పీవీ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ప్రాంతీయ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బ్రహ్మోత్సవాలకు హాజరై స్వామివారి దర్శనం చేసుకుంటానని తెలిపారు. ధార్మిక కార్యక్రమాలు సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్ టియుసి వైస్ ప్రెసిడెంట్ కృష్ణం రాజు, డా శేషగిరి రావు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి ఇంటర్నల్ మార్కుల తనిఖీ

**కారేపల్లి, మహా:** సింగరేణి మండలం లోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల పదవ తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల ను ప్రత్యేక తనిఖీ బృందాలు శుక్రవారం పరిశీలన ప్రారంభించినట్లు మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజు తెలిపారు. మార్కుల తనిఖీ కి కోమట్లగూడెం హైస్కూల్ హెచ్ఎం తేజావత్ శారద, బాజుమల్లయిగూడెం హైస్కూల్ హెచ్ఎం ఎం. వేణుమాధవరావు ఆధ్వర్యంలో రెండు బృందాలు పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల యొక్క నోట్ పుస్తకాలను పరిశీలించి విద్యార్థులు సాధించిన మార్కులను ఇంటర్నల్ మార్కులు గా ధృవీకరణ జరిపుతున్నారన్నారు. ఈ పరిశలన శనివారం కూడా కొనసాగుతుందని ఎంఈఓ తెలిపారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి..

**- విద్యార్థులకు సీఐ నాగబాబు సూచనలు..**



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల నేపథ్యంలో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు. ఈ సందర్భంగా సీఐ నాగబాబు మాట్లాడుతూ, లోన్ యాప్‌ల పేరుతో వేధింపులు, పీఓఎస్ యంత్రాల వద్ద మోసాలు, స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో జరిగే ఆన్‌లైన్ మోసాలు, ఏపీకే లింక్‌లు డౌన్‌లోడ్ చేయడం ద్వారా ఖాతాల నుండి డబ్బులు దోచుకునే ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. అనుమానాస్పద లింక్‌లు క్లిక్ చేయకూడదని, తెలియని యాప్‌లు డౌన్‌లోడ్ చేయవద్దని సూచించారు. సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని, సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు. వ్యక్తిగత సమాచారం, ఓటీపీలు, బ్యాంక్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. అనంతరం Aఎస్సై శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, ఫేక్ ప్రొఫైల్‌లు, మోసపూరిత పెట్టుబడి ఆఫర్లను నమ్మవద్దని విద్యార్థులకు సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉంటేనే మోసాలను నివారించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.


ANN AWARDS
MARCH 15TH
2026
Apply Now:

# ఎవరూ ఊహించని పాత్రలో రష్మిక.. నిజమేనా?



ఇండస్ట్రీలో ఒకప్పటితో పోలిస్తే పరిస్థితులు ఇప్పుడు చాలా మారిపోయాయి. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలు చూసే జనాలు తగ్గిపోయారు. హీరోహీరోయిన్లు ఎవరైనా సరే కాస్త వైవిధ్యమైన పాత్రలు చేస్తే చూసేందుకు ఏ మాత్రం వెనుకాడటం లేదు. అయితే అలాంటివి చేసే వాళ్లు మాత్రం ఇప్పటికే కాస్త తక్కువగానే ఉన్నారని చెప్పొచ్చు. కానీ రష్మిక మాత్రం ఇప్పుడు పెద్ద సాహసమే చేసినట్లు తెలుస్తోంది. తెలుగు ప్రేక్షకులు.. కనీసం కలలో కూడా ఊహించని పాత్రలో కనిపించనుందని టాక్ అయితే గట్టిగా వినిపిస్తోంది.

స్వతహాగా కన్నడ అమ్మాయి అయిన రష్మిక.. తొలుత సొంత భాషలో గుర్తింపు తెచ్చుకుని తర్వాత తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది. ఇక్కడ మహేశ్ బాబు, అల్లు అర్జున్ లాంటి స్టార్ హీరోలతో కలిసి నటించి స్టార్‌డమ్ సొంతం చేసుకుంది. 'పుష్ప' మూవీతో పాన్ ఇండియా వైడ్ సెన్సేషన్ అయిపోయింది. గత కొన్నాళ్ల నుంచి బాలీవుడ్‌లోనూ వరస చిత్రాల్లో నటిస్తూ ఫుల్ బిజీగా మారిపోయింది. అలా ఈమె చేసిన హిందీ సినిమాల్లో 'కాక్‌టెయిల్ 2' కూడా ఒకటి.

ఈ సినిమాలో షాహిద్ కపూర్, కృతి సనన్, రష్మిక నటించారు. అయితే ఇదో ట్రయాంగిల్ లవ్ స్టోరీ అని, కాకపోతే కృతి సనన్, రష్మిక.. స్వలింగ సంపర్క పాత్రల్లో కనిపించనున్నారని బాలీవుడ్ మీడియాలో గట్టిగా వినిపిస్తుంది. అంటే లెస్బియన్ పాత్రలు అనమాట. బాలీవుడ్ సినిమాల్లో ఈ పాయింట్ అప్పుడప్పుడు టచ్ చేస్తుంటారు గానీ దక్షిణాదిలో ఇలాంటి పాత్రలు రావడం దాదాపు అసాధ్యం. అందున స్టార్ హీరో లేదా హీరోయిన్లు ఇలాంటి చేయరు. మరి రష్మిక ఈ తరహా పాత్ర చేసిందని రూమర్స్ వస్తున్నాయి. ఒకవేళ ఇది నిజమైతే గనక తెలుగు ఆడియెన్స్ ఎలా రిసీవ్ చేసుకుంటారో చూడాలి?

ఇకపోతే రష్మిక వచ్చే వారమే పెళ్లి చేసుకోనుంది. ప్రియుడు విజయ్ దేవరకొండతో కలిసి కొత్త జీవితం ప్రారంభించనుంది. రాజస్తాన్ వేదికగా ఈ నెల 26న డెస్టినేషన్ వెడ్డింగ్ జరగనుంది. ఈ శుభకార్యానికి ఇరువురి కుటుంబ సభ్యులు, కొద్దిమంది సన్నిహితులు మాత్రమే హాజరు కానున్నారు. మార్చి 4న హైదరాబాద్‌లో రిసెప్షన్ జరగనుంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com